

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
రాయచోటి	6.31	4.55
మదనపల్లె	6.32	5.01
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.30	4.54



భోగంపల్లె రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలతో తగ్గిన నీరు



రిజర్వాయర్‌లో తోడేస్తున్నారు...

- ఎక్స్‌కవేటర్లతో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- భోగంపల్లె రిజర్వాయర్‌లో తగ్గిన నీటినిల్వలు
- తాగునీటి గండం తప్పదా?
- బాహుదా నది నుంచీ తరలింపు


వాల్మీకిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణానికి అత్యంత సమీపంలోని భోగంపల్లె వద్ద ఉన్న రిజర్వాయర్ ప్రాంతం ఇసుకాసురుల ఆగడాలతో రూపురేఖలే కోల్పోతోంది. ఈ రిజర్వాయర్‌లోనే రెండు తాగునీటి బోరుబావులను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెండు నెలల నుంచి రిజర్వాయర్ ప్రాంతంలో ఎటుచూసినా ఎక్స్‌కవేటర్ల ద్వారా అక్రమ తవ్వకాలు, ట్రాక్టర్ల ద్వారా మదనపల్లె తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. పలుచోట్ల అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కూడా ఈ ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు తవ్వకాలను అడ్డుకుని వాహనాలను సీజ్ చేస్తున్నా ఇది మామూలే కదా అంటూ ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలోని కూరపర్తి, మూగలమర్రి, చింతపర్తి, మంచూరు, మాధవరంపల్లె టి.సాకిరేవుపల్లె, తదితర ప్రాంతాలలోని బాహుదా కాలువలో ఇష్టారాజ్యంగా యంత్రాలు పెట్టి ఇసుక తవ్వకాలకు పాల్పడుతూ రహస్యంగా డంపింగ్‌లు చేస్తున్నారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామ సమీపంలో ఉన్న వంకలో సైతం ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. వేసవిలో వాల్మీకిపురం పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక తవ్వకాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వాల్మీకిపురం గుండా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక



భోగంపల్లె సమీపంలోని కాలువ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్న ఎక్స్‌కవేటర్



వాల్మీకిపురం మండలంలోని కూరపర్తి వద్ద బాహుదా కాలువలో అక్రమ ఇసుక డంపింగ్

అనుమతి లేని తవ్వకాలపై చర్యలు

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడినా, స్థానిక అవసరాలకు కాకుండా బయటి ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేసినా చర్యలు తీసుకుంటాం. భూములను లీజుకు తీసుకుని ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు కూడా వచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకు భూముల లోపలి భాగంలో ఉండే సంపదను వెలికి తీసేందుకు ప్రభుత్వ అనుమతులు ఉండాలి.

-పామిలేటి, తహసీల్దార్, వాల్మీకిపురం

ఇసుక తోడితే కఠిన చర్యలు..

పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. రిజర్వాయర్ ప్రాంతంలోని రెండు బోరుబావుల ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో నిత్యం నిఘా పెట్టి ఇసుక తవ్వకాలను అడ్డుకుంటాం. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

- రవీంద్రనాథ్, గ్రామ పంచాయతీ ఈవో, వాల్మీకిపురం.

వైభవంగా కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో తదితరులు

ఒంటిమిట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలోని కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో బోర్డు సమావేశం అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, 10న గరుడ వాహనం, 11న సాయంత్రం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 12న రథోత్సవం, ఏప్రిల్ 14న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద బస్సులు ఆపేశారు...

- ఫాస్టాగ్ పనిచేయక...
- నిలిపివేసిన టోల్‌ప్లాజా సిబ్బంది
- ఎండలతో ఇబ్బంది పడ్డ ప్రయాణికులు



టోల్‌గేట్ వద్ద ఆగిపోయిన ఆర్టీసీ అద్దె బస్సు

రామాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినరి అద్దె బస్సులు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి బండపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ వద్ద సోమవారం ఆగిపోయాయి. ఫాస్టాగ్ టెక్నికల్ సమస్య వల్ల టోల్‌గేట్ సిబ్బంది బస్సులను అక్కడే ఆపివేశారు. దీంతో బస్సుల్లోని ప్రయాణికులు ఎండ వేడిమి, ఉక్కపోతతో అనేక ఇబ్బందులు పడ్డారు. అసలే వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బస్సుల్లో ఉన్న ప్రయాణికులకు, బస్సు డ్రైవర్, కండక్టర్ల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు బస్సు నిర్వాహకులు, యజమానులు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని ఫాస్టాగ్ పనిచేయకపోవడంతో నగదు చెల్లించి ఒక్కొక్క బస్సును అక్కడి నుంచి పంపించారు. ఈ విషయమై ఆర్టీసీ ఆర్ఎం రామును వివరణ కోరగా టెక్నికల్ సమస్య వల్ల బస్సులు టోల్‌గేట్ వద్ద ఆగిపోయాయని, వెంటనే డబ్బులు కట్టి బస్సులను అక్కడి నుంచి పంపించినట్లు తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు.

ప్రజల నుంచి అందిన కొన్ని విజ్ఞప్తులు

తన భర్త 2019వ సంవత్సరంలో చనిపోయాడని, తనకు నలుగురు పిల్లలు ఉన్నారని, తన భర్త చనిపోయిన తర్వాత మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద అప్లై చేసుకున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి సహాయం అందలేదని, తన పిల్లలకు మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద సహాయం ఇప్పించాలని లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన తోట వెంకటశివమ్మ విన్నవించుకుంది. తనకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని, తాను నిరుపేదనని, తనకు రేషన్‌కార్డు ఇప్పించాలని సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శరభంద కలెక్టర్‌ను కోరింది. తన అనుభవంలో ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని సుండుపల్లె మండలానికి చెందిన నారాయణ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

'యోగివేమన'కు రూ.7 కోట్లు విడుదల

- జీతాలు, పెన్షన్ల కోసం అదనపు కేటాయింపు

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడప యోగివేమన యూనివర్శిటీకి రూ.7 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం బడ్జెట్‌ను మించి అదనపు కేటాయింపుగా మంజూరు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వైవీయూకు రూ.42 కోట్ల 4 లక్షల 66 వేలు కేటాయించారు. ఈ మొత్తాన్ని వినియోగించుకొనేందుకు గతంలోనే అనుమతించారు. ఇది కాకుండా అదనపు కేటాయింపుగా వర్శిటీ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ఈ అదనపు నిధులు ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు, పెన్షన్లు డ్రా చేసుకొనేందుకు యూనివర్శిటీకి అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ చేశారు.

పచ్చదనాన్ని పరిరక్షించాలి

- ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్



సోమశిల వెనుకజలాల వద్ద విద్యార్థులతో ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్

ఒంటిమిట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అడవులు మనకు జీవనాధారమని, పచ్చదనాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఒంటిమిట్టలో నేచర్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో ఒంటిమిట్టలోని సాయిభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అడవులు లేకపోతే వాతావరణంలో మార్పులు తీవ్రంగా ఉంటాయని మన జీవన విధానంలో ఎదురయ్యే సమస్యలను విద్యార్థులకు వివరించారు. క్యాంపులో భాగంగా విద్యార్థులను సోమశిల వెనుకజలాల వద్దకు తీసుకెళ్లి నీటి ప్రాముఖ్యతను వివరించారు. జలాశయం చుట్టూ పెద్దఎత్తున అడవులు ఉన్నందున వాతావరణ పరిస్థితులను తెలియజేశారు. నీటి సంపద కాపాడాలంటే అడవులను పరిరక్షించాలనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగునాయక్, ఎఫ్ఎస్‌వో బ్రహ్మయ్య, ఏపీవో బాషా, సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, ఉపాధ్యాయుడు రాజా, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలుపుదాం.. టీబీ నివారిద్దాం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చేయి చేయి కలుపుదాం.. టీబీ (క్షయ) వ్యాధిని అంతం చేద్దామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీని ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని 61 పంచాయతీలను టీబీ ముక్త్ అభియాన్ కింద ఎంపిక చేసి పంచాయతీ సర్పంచ్‌లు, సీహెచ్‌వోలకు టీబీ ముక్త్ పంచాయతీ అవార్డ్ ప్రదానం చేసినట్లు తెలిపారు. 2027 నాటికి టీబీ ఎలిమినేషన్‌లో భాగంగా అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీయూ, పీహెచ్‌సీలు, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం గళ్ల, ఎక్స్‌రే పరీక్షలను పూర్తిగా ఉచితంగా చేస్తామని, వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచితంగా డాట్స్ ద్వారా మందులు కూడా ఇస్తారన్నారు. అదనపు డీఎంహెచ్‌వో, టీబీ కార్యక్రమ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9 టీబీ యూనిట్స్ ఉన్నాయని, ప్రతి యూనిట్‌లో సిబ్బంది ఉన్నారని, వారంతా టీబీ యూనిట్ పరిధిలో టీబీ కేసులను గుర్తించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం, చికిత్స డాట్స్ ద్వారా పెట్టడం, రోగులకు ప్రధాన మంత్రి పోషణ అభియాన్ పథకం కింద నెలకు రూ.1000 వారి ఖాతాలో జమ చేయించడం వంటివి చేస్తారని తెలిపారు. అనంతరం టీబీ వ్యాధి నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, డాక్టర్ కోటేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రియాజ్ బేగ్, ఎంవోటీసీలు డాక్టర్ అశ్విని, డాక్టర్లు రియాజ్, రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా టీబీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి, లింక్ వర్కర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అల్లావలి, టీబీ పర్యవేక్షకులు శ్రీనివాసులు, మురళి, ప్రణీత్, భూపతి, తరుణ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో జరిగిన ర్యాలీలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రేషన్ పొందాలంటే... ఈకేవైసీ తప్పనిసరి

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ.. ఈనెల 31న చివరి తేదీ
- జిల్లాలో 1.60 లక్షల మంది పెండింగ్



మదనపల్లె మండలం గొల్లపల్లెలోని 31వ చౌకదుకాణంలో ఈకేవైసీ రిపోర్టును పరిశీలిస్తున్న సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్



కార్డుదారుడి నుంచి ఈకేవైసీ చేయిస్తున్న ఎండీయూ ఆపరేటర్ నవాజ్‌బాషా

మదనపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ అంటే..కస్టమర్ ఆర్థిక, వ్యాపార వ్యవహారాల గుర్తింపును డిజిటల్ పద్ధతిలో గుర్తించే ప్రక్రియ. దీనిని రేషన్ కార్డులోని సభ్యులంతా చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సివిల్ సప్లయ్ కమిషనర్ సౌరబ్‌గౌర్ కూడా ఆదేశాలు ఇచ్చారు. పెండింగ్‌లోని సభ్యులంతా ఈనెల 31వ తేదీలోగా చేసుకోవాల్సి ఉంది. ఈకేవైసీ చేసుకోకుంటే భవిష్యత్తులో రేషన్ సరఫరా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేరేందుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు కూడా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంది. రేషన్ డీలర్ల లాగిన్, తహసీల్దార్ లాగిన్, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌వో), కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో ఈపీడీఎస్ అప్లికేషన్‌లో ప్రభుత్వం పెండింగ్ సభ్యుల జాబితా అందుబాటులో ఉంచింది. ఈ ప్రక్రియను రేషన్ డీలర్ వద్ద గల ఈ-పాస్ మిషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్, గ్రామ, వార్డు సచివాలయంలో చేసుకునే అవకాశం కల్పించారు. సభ్యుడు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సమీపంలోని చౌకదుకాణం, మీసేవ, ఆధార్ సెంటర్, గ్రామ, వార్డు సచివాలయంలో ఎక్కడికైనా వెళ్లి ఈకేవైసీ చేసుకోవచ్చు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీ సహా 30 మండలాల్లో 14,82,094 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 13,21,098 మంది ఈకేవైసీ చేయించుకోగా, సోమవారం సాయంత్రానికి 1,60,996 మంది పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మదనపల్లెలో 18,663 మంది, రాయచోటిలో 14,162 మంది, రాజంపేటలో 10,403 మంది సభ్యులు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లు బెస్ట్ డిటెక్టివ్ ఫింగర్ (బీడీఎఫ్)తో పాటు రేషన్‌కార్డులోని సభ్యులందరికీ ఈకేవైసీ చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రక్రియ చేపట్టలేదు. అప్పటికే మిగిలిపోయిన తర్వాత రేషన్‌కార్డులో నమోదైన సభ్యులకు ప్రస్తుతం ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఇందులో ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చింది. పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల పారదర్శకత కోసం జాతీయ సమాచార వ్యవస్థ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ చేసుకోని వారికి కూడా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా తాజా నిబంధనల ప్రకారం రేషన్‌కార్డులోని సభ్యుడు (యూనిట్) రేషన్ పొందాలంటే ఈకేవైసీ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ కోసం కాకపోయినా... ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలంటే తప్పనిసరిగ్గా వేలిముద్ర ఆధారిత గుర్తింపు అవసరమయ్యే నేపథ్యంలో ఈకేవైసీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో రాష్ట్ర స్థాయిలో సివిల్ సప్లయ్ కమిషనర్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఎస్‌వో, డివిజన్ స్థాయిలో సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు రోజువారీ సమీక్షిస్తున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, సీఎస్ డీటీలు అటు రేషన్ డీలర్లను, ఇటు ఎండీయూ ఆపరేటర్లను వెంటాడుతున్నారు. రోజువారీ ప్రోగ్రెస్ ఉండేలా ఫాలోఅప్ చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా, మండలం, రేషన్ దుకాణం వారీ పెండింగ్ జాబితా విడుదల చేశారు. వీటిని అనుసరిస్తూ డీలర్లు, ఎండీయూలు సంయుక్తంగా గ్రామాలు, వార్డుల్లోకి వెళ్లి సభ్యులను పిలిపించి ఈ ప్రక్రియ పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత రేషన్‌కార్డు, కొత్త రైస్‌కార్డు నెంబర్, సభ్యుడి పేరు చూపించారు. కానీ పెండింగ్ జాబితాలో ఫోన్ నెంబర్ లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. ఆ పేరు గల వ్యక్తులు గత ఐదేళ్లలో పట్టణాల్లో నివాసాలు మార్చేశారు. మరికొందరు ఉపాధి నిమిత్తం వలస వెళ్లగా, మరికొందరు మరణించిన వారూ ఉన్నారు. వీరిని గుర్తించడమే పెద్ద టాస్క్‌గా మారింది. ఈ క్రమంలో ఈనెల 25వతేదీ నాటికి అందుబాటులోని సభ్యులకు ఈకేవైసీ పూర్తి చేస్తే తర్వాత అయిదారు రోజుల్లో మైగ్రేట్, డెత్ కేసులపై దృష్టి సారించాల్సి ఉంది. వీటిని మాత్రం తహసీల్దార్ లాగిన్‌లో చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



అన్నమయ్య కాలిబాట అటకెక్కినట్లేనా?

- రెండు దశాబ్దాలుగా పెరుగుతున్న డిమాండ్
- గతంలో సుముఖత వ్యక్తం చేసిన టీటీడీ
- అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు
- ఆ తర్వాత నోరు మెదపని పాలకులు



మలుపులు లేని శేషాచలం అన్నమయ్య కాలిబాట

రాజంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బాలపల్లె అటవీ ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు అంశం అటకెక్కినట్లుగా కనిపిస్తోంది. కడప, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర వాసులకు ఎంతో ఉపకరించే ఈ మార్గం ఏర్పాటు విషయం గత ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదు. పూర్వ కాలంలో తిరుమలకు వెళ్లే భక్తులు అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాక నుంచి బాలపల్లె అటవీ ప్రాంతంలోని మామండూరు, రైల్వేకోడూరు మీదుగా కాలినడకన వెళ్లేవారు. అప్పటి కాలిబాట నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. అటువంటి మార్గంలో రోడ్డు వేయాలని భక్తులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజంపేట ప్రాంతానికి చెందిన వేలాదిమంది కాలినడకన తిరుపతికి వెళ్లి మరీ విజ్ఞప్తి చేశారు. తిరుపతికి వెళ్లి తిరుమలకు చేరుకోవడం అందరూ చేస్తున్న పని. దీంతో తిరుపతిలో రద్దీ పెరిగింది. అదే అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరిస్తే సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఘాట్‌రోడ్డు అవసరమూ ఉండదు. ఒకానొకదశలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఘాట్‌రోడ్డు నిర్మాణంపై సుముఖత వ్యక్తం చేసింది. కాలిబాట పునరుద్ధరణకు కేంద్రం, అటవీశాఖ అనుమతిస్తే పనులు ప్రారంభిస్తామని టీటీడీ గత చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు కూడా. అయితే ఆ ప్రతిపాదన కేవలం ప్రకటనల వరకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్నమయ్య కాలిబాట పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరుపతిలో రద్దీ తగ్గుతుంది



అన్నమయ్య, కడప జిల్లాల అభివృద్ధికి ఎంతో ఉపకరించే అన్నమయ్య కాలిబాటను వెంటనే ఏర్పాటు చేయాలి. శతాబ్దాల కిందటే అన్నమయ్య తాళ్లపాక నుంచి ఏడు కొండల ద్వారా కాలినడకన శ్రీవారి చెంతకు వెళ్లేవారు. ఈ మార్గాన్ని ఏర్పాటు చేస్తే ఎటువంటి రద్దీ ఉండదు. తిరుపతిలో భక్తుల రద్దీ తగ్గి అక్కడ ప్రశాంతత ఏర్పడుతోంది. దూరం తగ్గుతుంది. తిరుపతితో పాటు అన్నమయ్య జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది.

- పీసీ యోగీశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్,



అన్నమయ్య కాలిబాట వెళ్లే శేషాచలం అడవులు

కాలిబాటను ఏర్పాటు చేయాలి



అన్నమయ్య జిల్లా పర్యాటక ప్రాంతంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలంటే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు చేయాలి.. దీంతో అన్నమయ్య భక్తికి సార్థకత చేకూరుతుంది. అన్నమయ్య జిల్లా కూడా తిరుమల తిరుపతిలా పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెంది ప్రపంచంలోనే గుర్తింపు పొందుతుంది. ప్రజా ప్రతినిధులు కాలిబాటలో రోడ్డు ఏర్పాటుకు నడుం బిగించాలి.

- మధుసూదన్‌రెడ్డి, తాళ్లపాక

నీటి సరఫరా పథకాల్లో అవినీతి

- రూ.3.10 లక్షలు దుర్వినియోగం ..
- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై అభియోగాలు నమోదు

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వీరబల్లి మండలం గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ ఎస్.ఇర్ఫాన్ అహ్మద్‌పై ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోదు చేసింది. ఈ మేరకు ఆయన నుంచి వివరణ కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేసింది. కర్నూలు జిల్లా డోన్ సబ్ డివిజన్ కృష్ణగిరి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈగా పనిచేసే సమయంలో మూడు తాగునీటి సరఫరా పథకాల నిర్మాణాల విషయంలో ఆయన అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం పేర్కొంది. కృష్ణగిరి మండలంలో కటారి కొండకు రూ.19 లక్షలు, కృష్ణగిరికి రూ.17 లక్షలు, తాపలకొత్తూరుకు రూ.17 లక్షలతో మూడు రక్షిత నీటి సరఫరా పథకాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు ఇర్ఫాన్ అహ్మద్ సర్టిఫికెట్లు జారీ చేశారు. దీంతో వంద శాతం చెల్లింపులు చేసేశారు. ఫిర్యాదులు రావడంతో ఆ శాఖ విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ విభాగం 2023 సెప్టెంబరు 8న తనిఖీ చేసింది. మూడు పథకాలకు సంబంధించి రూ.3.10 లక్షల విలువైన పనులు ఇప్పటికీ పెండింగులో ఉన్నట్లు గుర్తించారు. ఫలితంగా తాగు నీటి సరఫరా జరిగే అవకాశం లేకుండా అసంపూర్తిగా మిగిలాయి. మొత్తం వ్యవహారాన్ని ఆ శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్ ఈ నెల 22న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. వెంటనే స్పందించి పూర్వాపరాలను పరిశీలించి ఇర్ఫాన్ అహ్మద్ తప్పిదాలను నిర్ధారిస్తూ అభియోగాలపై నోటీసులు జారీ చేసింది. 10 రోజుల్లోగా ఆయన సంజాయిషీ సమర్పించుకునేందుకు గడువిచ్చింది. ఈయనతో పాటు అప్పట్లో డీఈగా పనిచేస్తూ ఈ పనులను పర్యవేక్షించి ప్రస్తుతం ప్రకాశం జిల్లా పొదిలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.సురేష్‌బాబుకు కూడా ఇదే విధమైన నోటీసులు జారీ అయ్యాయి. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఈ మేరకు అన్ని రకాల సాక్ష్యాధారాలతో ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు డీఎల్‌సీఓ తిరుపతికి బదిలీ

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలోడిప్యూటీ రిజిస్ట్రారు హోదాలో వుంటూ ప్రస్తుతం ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న జె.సురేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయనను తిరుపతి డీఎల్‌సీవోగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దంపతుల కేటగిరీ కింద ఆరోగ్య కారణాల రీత్యా తిరుపతిలో ఖాళీగా వున్న డీఎల్‌సీవో పోస్టుకు ఆయన్ను బదిలీ చేశారు. ప్రస్తుతం బదిలీలపై వున్న నిషేధాన్ని మినహాయిస్తూ ఆయన చేసుకున్న దరఖాస్తు మేరకు బదిలీ చేస్తున్నట్లు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డెప్యుటేషన్‌పై విజయవాడకు కడప మత్స్య శాఖ డీడీ

కడప మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న వి.పెద్దిబాబును డెప్యుటేషన్‌పై విజయవాడకు బదిలీ చేశారు. విజయవాడలో వున్న ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ జనరల్ మేనేజరుగా నియమించారు. ఏడాది కాలం పాటు డెప్యుటేషన్‌లో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మత్స్య శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలో సోమవారం గుర్తు తెలియని యువకుడు ఇంట్లోకి చొరబడి వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లాడు. అరవడానికి వీలు లేకుండా, నోరు నొక్కి ఒత్తిడి చేశాడని, ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి ఉన్నట్లు బాధితురాలు రాజమ్మ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు 35 గ్రాముల చైన్ రెండు లక్షల రూపాయలు విలువ చేస్తుందని ఆమె వివరించింది. ఇ వన్‌టౌన్ సీఐ ఎరిసావలి కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

ఇంట్లో దండించారని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి24(ఆంధ్రజ్యోతి)ఇంట్లో దండించారని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని రాజానగర్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు బన్నీ (19) ఇంటర్ పస్ట్ ఇయర్ చదివి ఇంట్లో ఖాళీగా ఉన్నాడు. జులాయిగా తిరుగుతుండడంతో సోమవారం తల్లి పార్వతి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకుతో గొడవపడి తండ్రి..

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కొడుకుతో గొడవపడి ఓ తండ్రి ఆత్మహత్యా యత్నం చేశాడు. మదనపల్లె పట్టణం, విజయనగర్ కాలనీకి చెందిన కృష్ణప్ప(60) ఆవులకు మేత తీసుకురావాలని తన కొడుకుకు సూచించాడు. అతను వెళ్లకపోవడంతో గొడవపడ్డాడు. దీంతో ఆవేశానికి లోనై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె టూ టౌన్ పోలీసులు కేసును విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు ఆదివారం రాత్రి మండలంలోని గంగన్నగారిపల్లెకు చెందిన మధు, తన భార్య లక్ష్మి వాదులాడుకుంటుండగా పక్కనే మద్యం తాగుతున్న ముగ్గురు యువకులు అతనిపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.


చిప్పిలిలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల దాడిలో ముగ్గురు యువకులు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామంలో కొందరు యువకులు సోమవారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో లడ్డు అనే యువకుడు జంగాలపల్లెకు చెందిన ఆదికేశవ(40), వేంపల్లెకు చెందిన చరణ్(30), అవకిశెట్టిపల్లెకు చెందిన సుమంత్(30)ను రాళ్లతో కొట్టి గాయపర్చాడు. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదికేశవ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

రామాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత రామాపురానికి చెందిన వెన్నుపూస నరేంద్ర తన కమారుడు యస్విక్‌ప్రసాద్‌తో కలసి సోమవారం బైక్‌లో రాయచోటి నుంచి రామాపురానికి వస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో కడప నుంచి వస్తున్న కారు ముందు వస్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెక్కల కొండకు నిప్పు



మంటల్లో కాలిపోతున్న రెక్కలకొండ

పెద్దమండ్యం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) మండలంలో రెక్కల కొండ అడవికి సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వందల ఎకరాలు అటవీ ప్రాంతం కాలి బూడిద కాగా వన్య ప్రాణులు అగ్నికి ఆహుతైనట్లు పలువురు వాపోతున్నారు. అడవిలో నిప్పు పశువుల కాపరుల పనేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా అటవీ అధికారులు చర్యలు తీసుకొని నిప్పుబారి నుంచి అడవిని కాపాడాలని ప్రజలు కోరారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ



రాయచోటి: అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



కడప: వికలాంగుడి సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యో తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్ర జా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుం చి వచ్చిన ఫిర్యా దుదారులతో ముఖాముఖి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేసి నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు తమకు సమీపం లోని పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

కడప క్రైం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యమిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసు స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదు లను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్ బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను తక్షణమే పరిష్కరించాలి: సబ్ కలెక్టర్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి

రాజంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలపై విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కారవేదిక కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఏవైనా చిన్న సమస్యలు పరిష్కరించకుండా కార్యాలయాల చుట్టూ బాధితులను తిప్పుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.12 లక్షలు మోసం చేసిన మూలగంగమ్మ డ్వాక్రా గ్రూపు లీడర్ షేక్. మౌలాబీపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరానికి చెందిన మూలగంగమ్మ తల్లి డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్ షేక్. మౌలాబీ తప్పుడు సంతకాలతో కడప డీసీసీ బ్యాంకులో రూ.12 లక్షలు డ్రా చేసిందన్నారు. డబ్బులు కట్టాలని బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులను అడగడంతో విషయం బయటపడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేసన్ జిల్లా కమిటీ సభ్యులు రమణ, సుజాత తదితర కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.


కేబుల్ వైర్ చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు

నిమ్మనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కేబుల్ వైర్ల దొంగలు వీరవిహారం చేస్తున్నారు. దాదాపు వారం రోజులుగా రాత్రి వేళల్లో నిమ్మనపల్లి, వెంగంవారిపల్లి, అగ్రహారం పంచాయతీలోని వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న దాదాపు 1000 మీటర్ల కేబుల్ వైర్లను చోరీకి గురికాగా, ఆదివారం రాత్రి మాత్రమే 25 బోర్లకు చెందిన కేబుల్ వైర్లను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది.

దీని విలువ దాదాపు రూ.లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. తిరిగి కేబుల్ ఏర్పాటు చేసుకునేందుకు 10 రోజులు పడుతుందని, ఈ లోగా పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీనిపై సోమవారం వెంగళకురవపల్లికి చెందిన రైతు హరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక్క రోజు రాత్రి మాత్రమే మూడు గ్రామాల్లో కేబుల్ వైర్లు చోరీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజుల క్రితం పోలీసులు ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండుకు తరలించారు. అయినా దొంగలు కేబుల్ తీగలనే టార్గెట్‌గా పెట్టుకుని పోలీసులకే సవాల్ విసురుతున్నారు.

తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం

- వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి



తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన అచార్యులు ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు రెండో విడత తైక్వాండో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణను పెంపొందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు నాగూర్‌బాబు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి డీవీ రంగరాజు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి డీవీ రంగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. ముఖ్యంగా కర్మాగారాలు, ఫ్యాక్టరీలు, దుకాణాల సంస్థల్లో పనిచేసే కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలని, పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఫ్లూయిడ్స్ అత్యవసరమైన మందులను అదుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని, కార్మికులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని కర్మాగారాలు, ఫ్యాక్టరీ యజమానులు, దుకాణదారులకు ఆదేశించారు.

పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్!

- వేంపల్లిలోని పరీక్ష కేంద్రాల్లో డీఈఓ షంషుద్దీన్ తనిఖీ

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష సరళిపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక బాలుర, బాలికల హైస్కూళ్లలోని నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తుండగా మాస్ కాపీయింగ్ జరుగుతోందంటూ ఫిర్యాదులు అందడంతో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓ పరీక్ష కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని ఫిర్యాదు అందడంతో డీఈవో సంబంధిత గదిలోని విద్యార్థులను తనిఖీ చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులపై ఇన్విజిలేటర్లను, ఎంఈఓలను అప్రమత్తం చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా తప్పు జరిగితే కఠిన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చ రించారు. అయితే డీఈఓ తనిఖీలపై పలువురు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనిఖీలు చేశారని, దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురై, జవాబులు మరచిపోయి, పరీక్ష సరిగా రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంటే పట్టుకోవాలి తప్ప భయంగొలిపే విధంగా అక్కడే ఉండి తనిఖీలు చేయడం ఏమిటని వాపోతున్నారు. ఫిర్యాదులు అందడం వల్లే తనిఖీలు చేశామని, వేంపల్లెతో పాటు బి.మఠం, కందిమల్లాయపల్లె, చక్రాయపేట మండలాల్లో ఫిర్యాదులు అందాయని, అన్నిటిపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు.

రైల్వే కోడూరులో..

రైల్వేకోడూరు రూరల్: పట్టణంలోని పది పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరోపించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థ విద్యార్థులు ఐడెంటిటీ కోసం చేతులకు ఎరుపు రంగు బ్యాడ్జీలు ధరించి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వీరిపట్ల ఇన్విజిలేటర్లు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న విద్యాసంస్థలు, ఇన్విజిలేటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో భాష్యం విద్యా సంస్థల్లో ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్‌కు వివిధ విభాగాలకు చెందిన 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 19 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిని వైవీయు అధికారులు అభినందించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సభ్యుడు డాక్టర్ గణేష్ నాయక్, భాష్యం విద్యాసంస్థల రాయలసీమ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాగ్నిజెంట్ కంపెనీలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



కాగ్నిజెంట్ సంస్థకు ఎంపికైన విద్యార్థులు

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన కాగ్నిజెంట్ ఐటీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. 25 మందికి ఉద్యోగాలు రాగా ఇందులో రూ.4.50లక్షల వేతనం కొందరు, రూ.5 నుంచి రూ.7లక్షల వరకు వేతనానికి మరి కొంతమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆహ్వానం మేరకు కాగ్ని జెంట్ ఐటీ సంస్థ ఈ క్యాంపస్ సెలక్షన్లను నిర్వహించడం మంచి పరిణామమని డైరెక్టర్ గుప్త అన్నారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినం దించారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాష్, ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు వినోద్, సుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామిరెడ్డికి డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా సెండ్ బాక్స్ కల్లూరి రఘురామిరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఊబకాయం, మధుమేహం ఆహారంతోనే తగ్గించే విధంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం లభించింది. నెంబర్ గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్ జర్మనీ జార్జ్ ఫ్రెండ్ పీటర్, నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కాపీర్వెల్, డాక్టర్ కిమ్, డాక్టర్ ఎ.గోపి కన్నన్‌చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

హుండీ ఆదాయం రూ.8 లక్షలు

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.8,15,239 వచ్చినట్లు ఈవో క్రిష్ణానాయక్ తెలిపారు. గంగమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని భక్తుల సమక్షంలో సోమవారం లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందని, ఈ ఆదాయాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మారుతీప్రసాద్, మహదేవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పుల్లయ్య, నాగమల్లారెడ్డి, లక్ష్మీదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బట్టా కిశోర్‌బాబు (30) మృతి చెందాడు. తీవ్రగాయాలైన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తీసుకెళ్లగా సోమవారం సాయంత్రం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు మండలంలోని గూడెంచెరువు రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనిచేసుకుని జీవించేవాడన్నారు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

బ్యాడ్మింటన్ చాంపియన్స్‌గా నాగరాజు-నితిన్ జోడీ

కడప స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర ఫక్కీరుపల్లె పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలలో నాగరాజు- నితిన్ జోడీ విజేతగా నిలిచింది. సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు న్యాయమూర్తి రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. కాగా టోర్నమెంట్ రన్నరప్‌గా నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి జోడీ నిలిచింది. ఇదిలావుండగా అంతర్జాతీయ అంపైర్‌గా బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న జిలానీబాషాను ఈ సందర్భంగా సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు

కాశినాయన మార్చి23(ఆంధ్రజ్యోతి) అదనపు కట్నం కోసం కుటుంబ సభ్యులతో కలిసి భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపించి మరో యువతిని గుడిలో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మిద్దెల ఎస్సీకాలనీకి చెందిన ఎర్రబల్లె ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కూతురు సంధ్యను 2023 మే నెలలో కమలాపురం మండలంలోని జి.అప్పాయపల్లెకు చెందిన కుందూరు ఓబులేసు కుమారుడు అనంతరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీఆర్వోగా పని చేస్తున్న అనంతరాజు పెండి చేసుకున్న కొన్నినెలలకే కుటుంబ సభ్యులతో కలిసి భార్య సంధ్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధించడం మొదలు పెట్టాడు. వారి బాధలు భరించలేక సంధ్య పుట్టింటికి చేరింది. ఇదే అదనుగా భావించిన అనంతరాజు అదే సంవత్సరం నవంబరు నెలలో బీర అంజలి అనే వేరొక యువతిని పుష్పగిరి ఆలయంలో గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య సంధ్య భర్త అనంతరాజుతో పాటు బీర అంజలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బీరం అంజలి మహిళా పోలీసుగా పనిచేస్తున్నట్లు సమాచారం.



తమలపాకు సాగు.. ధర బాగు..



రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట



దువ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నోరు పండించే తమలపాకు ధరలు మండుతున్నాయి. సాగు చేసిన రైతులు ఆనందపడుతున్నారు. గత కొంత కాలంగా మార్కెట్ ధరలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. దువ్వూరు మండలంలో విరివిగా తమలపాకు పంట సాగు చేశారు. రాంసాయినగర్, క్రిష్టంపల్లె, కానగూడూరు, దువ్వూరు ప్రాంతాల్లో సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఎకరాలో పంట సాగు చేయాలంటే రూ.2 లక్షల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ పైరుకు నిత్యం కూలీల అవసరం ఉంటుంది. పరిస్థితులు సహకరించితే సరి.. లేదంటే వైరస్ తెగుళ్ల ఆశిస్తాయి. ఇక ప్రకృతి వైపరీత్యాలు అప్పుడప్పుడు దాడి చేసి తోటలను ధ్వంసం చేయడం లాంటి సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితులు తలెత్తినప్పుడు రైతులు నష్టాలను మూట గట్టుకోవడం పరిపాటిగా మారుతుంది. ఇటువంటి విపత్కర పరిస్థితులను దాటుకుంటూ రైతులు ముందుకెళుతున్నా ఆశించిన ధరలు లేకపోతే రైతులు నష్టాలపాలవుతారు. రెండేళ్లుగా ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ధర లు ప ర్వాలేదనిపించినా ఆటుపోట్లు తప్పడం లేదు. దువ్వూరు ప్రాంతం నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, కర్నూలు ప్రాంతాలకు తమలపాకు కట్టలను బుట్టల్లో తరలిస్తున్నారు. బుట్టలో 22 నుంచి 25 కట్టలను ఉంచి ప్యాకేజీ చేసి తరలిస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో బుట్ట వెయ్యి రూపాయల నుంచి రూ1400 ధర ఉందని రాంసాయినగర్‌కు చెందిన చలపతి అనే రైతు తెలిపారు.

రైతులు ఇప్పుడే ఊపిరిపీల్చుకుంటున్నారు

- రైతులను నష్టపరిచింది వైసీపీ.. అండగా ఉన్నది టీడీపీ
- జగన్‌ది పరామర్శ యాత్ర కాదు.. జైత్రయాత్ర
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వడగండ్ల వాన, ఈదురుగాలులకు లింగాల మండలంలో దాదాపు 3వేల ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని, ఆ వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఏ రైతుకు ఎంత నష్టం జరిగిందనే విషయం స్పష్టంగా తేల్చి నష్టపరిహారం అందించే చర్యలు త్వరతగతిన చేపడుతుందన్నారు. ప్రభుత్వం ఇంతలా రైతులను ఆదుకోవాలని చర్యలు చేపడితే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లింగాలలో పర్యటించి నాలుగేళ్లు కళ్లుమూసుకోండి.. మన ప్రభుత్వం వస్తుందని రైతులకు చెబుతున్నారన్నారు. అప్పుడు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెబుతున్నారని, నష్టం ఇప్పుడు జరిగితే నాలుగేళ్ల తర్వాత ఆదుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు బాధల్లో ఉంటే వారికి ధైర్యం, ఓదార్పు ఇవ్వాల్సింది పోయి పర్యటన అంతా జైత్రయాత్ర మాదిరి ఉందన్నారు. 2014-19 కాలంలో రైతులందరికీ అరటి మొక్కలు ఉచితంగా ఇచ్చామని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం ఎస్సీ, ఎస్టీలకే ఉచితంగా ఇచ్చారన్నారు. పులివెందులలో రూ.25కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటుచేసిన మాట వాస్తవమే అయినా రూ.10కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా ప్రారంభించారని, కనీసం బోరు లేదు, జనరేటరూ లేదన్నారు. ఆ పెండింగ్ బిల్లులను ఈ ప్రభుత్వం చెల్లించి మెయింటెనెన్స్ చేసేందుకు ఏజెన్సీలను కూడా పిలవడం జరుగుతుందన్నారు. ఈనెల 28న కలెక్టర్ వద్ద ప్రీబిడ్ జరుగుతుందన్నారు. త్వరలో కోల్డ్‌స్టోరేజ్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. విషయాలు తెలుసుకొని మాట్లాడాలని, కేవలం విమర్శలు చేసి వెళ్లిపోతే సరిపోదన్నారు. రైతులు, ప్రజలంతా జరిగినవన్నీ గమనిస్తూనే ఉన్నారన్నారు.

వేసవి సమస్యలను అధిగమిద్దాం : డీఆర్వో

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీరు, అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా వడదెబ్బ సమస్యలను అధిగమించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో తాగునీటి కొరత, వేసవిలో వడగాల్పులు, వడదెబ్బ ముందస్తు జాగ్రత్తలపై జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్‌తో కలసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, దీనిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మండలాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏఎన్‌ఎంలతో కలసి వడగాల్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో షెడ్లు, మంచినీటితో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. అటవీ పరిరక్షణ ప్రాంతాల్లో పశు, పక్ష్యాదులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రథమ చికిత్స ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

- బైకు స్వాధీనం

కడప క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం కాలసముద్రానికి చెందిన షేక్ మౌలాలి పార్కింగ్ చేసిన బుల్లెట్ వాహనాలను చోరీ చేశాడని, ఈ మేరకు మౌలాలిని అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మరికొందరు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు నగర శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై, గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నకాశ్, సాయిపేట, ఉక్కాయపల్లె, మార్కెట్‌యార్డు, పాతకడప, మార్కెట్‌యార్డు వద్ద ఉన్న శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

25, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

- పటిష్టంగా నిర్వహించాలి : డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 27వ తేదీల్లో జరుగు ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్ట బందోబస్తు మధ్య, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే నాలుగు విధాల నోటిపికేషన్‌కు సంబంధించిన పరీక్షల నిర్వహణపై డీఆర్వో ఏపీపీఎస్సీ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, మానిటర్ షేక్ ఖాసీంవల్లితో కలసి అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 25, 27వ తేదీల్లో ఉదయం 9-30 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి పరీక్షలను సజావుగా జరపాలన్నారు. జిల్లాలో చింతకొమ్మిదిన్నె మండల పరిధిలో 3, చాపాడు మండలంలో-1, ప్రొద్దుటూరు-1 పరీక్షీ కేంద్రాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు, పరీక్షల నిర్వహణకు సంబందించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోవిందమాంబ ఆరాధనోత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేందస్వామి మఠంలో భక్తిశ్రద్ధలతో సోమవారం మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబ పరమేశ్వరి అమ్మవారి జీవసమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం సోమవారం క్రోధినామ సంవత్సర ఫాల్గుణ బహుళ దశమి రోజు కావడంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మధ్యాహ్నం ద్వార పూజ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి విశ్వబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి, విశ్వబ్రాహ్మణ భక్తుడు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పట్టుచీర, సారెను పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులకు అందించారు. రాత్రికి అమ్మవారిని మాడవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.



అమ్మవారికి సారె సమర్పించిన విశ్వ బ్రాహ్మణ కమిటీ భక్తులు

ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీ

- ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడి మృతి
- మహిళకు తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో కలమల్ల గ్రామ శివార్లలో సోమవారం సాయంత్రం ఈకో వ్యాన్ ద్విచక్రవానాన్ని ఢీకొన్న సంఘటనలో కలమల్లకు చెందిన ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు రాజారెడ్డి(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వివరాల్లోకెళితే.. ఆర్టీపీపీ 600ప్లాంట్ యాష్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న రాజారెడ్డి తన భార్య సుజాతతో కలిసి ఎలక్ట్రిక్ స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళుతున్నాడు. వెనుకవైపు నుంచి అతి వేగంగా వచ్చిన మారుతిసుజుకి ఈకో వ్యాన్ ఢీకొట్టి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో స్కూటీలో వెళుతున్న రాజారెడ్డి, ఆయన భార్య కిందపడ్డారు. రాజారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కలమల్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ సుజాతను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించారు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చల్లంగా చూడమ్మా.. గంగమ్మతల్లి

- వైభవంగా పాలగిరి గంగమ్మ జాతర
- తరలివచ్చిన భక్తులు



వీరపునాయునిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరిలో గంగమ్మజాతర వైభవంగా నిర్వహిం చారు. భారీఎత్తున భక్తులు తండోపతండోలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జంతుబలులు ఇచ్చారు. డప్పువాయిద్యాల మధ్య బాణసం చా పేల్చుతూ బోనాలు సమర్పించారు. బంధువులను స్నేహితులను ఆహ్వానించి విందుభోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి సిరిమాను బండిని ఎద్దులతో తిప్పారు. ఈ సిరిమాను ఉత్సవాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. జాతర సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఐటీడీపీ సూర్యనారాయణరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కుంటకట్ట సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి వద్ద చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పవన్‌కృష్ణ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం

- న్యాయవాదుల శిక్షణలో జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీదేవి



కడప రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇందుకు న్యాయవాదుల తోడ్పాటు చాలా అవసరమని, కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి కూడా వీలుపడదన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ పీజీ సురేష్, జి.జ్యోతి తదితరులు మధ్యవర్తిత్వం, ప్రాథమిక నియమాలు, అభ్యాస సూత్రాలు, వయోజన అభ్యాసం, పౌర విధాన నియమావళి 1908 తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఓ మహిళ పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ చేసింది. సినిమా ఫక్కీలో మూట ముట్టుకోకూడదని బంగారం అపహరించింది. బాధితురాలి వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీలో కారపాకుల సుజాత, చంద్రశేఖర్ దంపతులు జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు చంద్రలావణ్యకు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో ఇందుకు పూజలు చేస్తే తగ్గుతుందని స్థానిక మహిళ ఓ అపరిచితురాలి గురించి చెప్పింది. దీంతో సోమవారం మధ్యాహ్నం ఆ అపరిచిత మహిళను ఇంటికి పిలుచుకుని ఒంటి గంట సమయంలో పూజ చేయించారు. పూజలో భాగంగా ఇంటిలో ఉన్న బంగారు లేదా వెండి వస్తువులు రెండు బాక్సుల్లో పెట్టాలని సూచించడంతో తమ ఇంటిలో ఉపయోగించని బాక్సులు లేవని చెప్పారు. పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న రెండు బాక్సులను సంచిలో నుంచి తీసి అందులో ఆ బంగారం, వెండి వస్తువులు పెట్టాలని తెలిపింది. ఈ మేరకు ఒక బాక్సులో 15 తులాల బంగారం, ఇంకో బాక్సులో బియ్యం తదితర పూజా సామగ్రి పెట్టిందని, పూజ ముగిసిన తర్వాత ఒక డబ్బా తమకు ఇచ్చి సాయంత్రం వరకు తెరిచి చూడకూడదని సూచించిందన్నారు. అనంతరం ఆ మహిళను చంద్రశేఖర్ తన స్కూటీలో తీసుకెళ్లి తాడిపత్రి రోడ్డు బస్టాపు వద్ద దింపాడు. ఇంటికి వచ్చిన బాక్సు తెరిచి చూస్తే అందులో బంగారం లేదని, బంగారం బాక్సును అపరిచిత మహిళ తీసుకెళ్లిందని గ్రహించారు. దీంతో తాము మోసపోయామని తెలుసుకుని బోరున విలపిస్తూ పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. అపరిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. జమ్మలడుగు ఆదివారం రాత్రి బాలిక(10)పై 58 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెఫరెన్సు ఎ5/2028/2024 కలెక్టరు వారి కార్యాలయం, కడప.
తేది : 23.03.2025

పత్రికా ప్రకటన

1974వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ జిల్లాల (ఏర్పాటు) (ఆంధ్రప్రదేశ్ చట్టం నెంబరు 7, 1974) చట్టపు క్లాజు (ఇ) సబ్‌సెక్షన్ (2) సెక్షను3 ద్వారా సంక్రమించబడిన అధికారములు వినియోగిస్తూ ప్రస్తుతము ఉన్న కడప జిల్లా పేరును క్రింది షెడ్యూలులో తెలిపిన విధంగా జిల్లా పేరు మార్పునకు ప్రతిపాదించడమైనది. పై చట్టంలోని సెక్షను 3లోని సబ్ సెక్షను (5) ప్రకారము ఈ నోటీసును ఇస్తూ దీనిపై అభ్యంతరములు లేక సలహాలను జిల్లా యొక్క పేరు మార్పు విషయమున కడప జిల్లాలో నివసించు యావన్మంది ప్రజానీకానికి అనగా పై విషయమునకు సంబంధించిన వారందరు ఇచ్చు సూచనలను ప్రభుత్వముచే పరిగణలోనికి తీసుకొనబడును. ప్రజల అభ్యంతరములను మరియు సలహాలను ఆంగ్లము లేదా తెలుగు భాషలయందు వ్రాతపూర్వకముగా వ్రాసి జిల్లా కలెక్టరు కడప వారికి (కడప జిల్లాలో నివసించు ప్రజలు మాత్రమే) ఈ నోటిఫికేషను ప్రచురణ అయిన తేది నుండి 30 దినములలోగా చేరునట్లుగా సమర్పించుకొనవలెనని ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది.

షెడ్యూలు

ప్రస్తుతం ఉన్న జిల్లా పేరు	ప్రతిపాదించుచున్న జిల్లా పేరు
వై.యస్.ఆర్. జిల్లా	వై.యస్.ఆర్. కడప జిల్లా

సం/- డా. శ్రీధర్ చెరుకూరి, ఐఏయస్, జిల్లా కలెక్టరు, కడప.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఒంటిమిట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఛైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి విచ్చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఈ విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అదాలత్‌లో కడప డివిజన్‌లోని ఒంటిమిట్ట, సిద్దవటం, కడప టౌన్, చింతకొమ్మదిన్నె, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి ప్రజలు పాల్గొనవచ్చునన్నారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిల్వర్ బెల్స్ హైస్కూల్‌లో వ్యాయమ ఉపాధ్యాయుడు ఎం.శ్రీహరి శెట్టిగుంట వద్ద ఈ నెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థుల సహకారంతో రూ.1,10,440 సాయం అందించారు. సోమవారం తిరుపతి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి.కుమార్, ప్రధాన ఉపాధ్యాయులు రాహుల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

రామాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవిని స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలను పెంపొందించడం కోసం స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్స్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. పీఎం శ్రీనిధులు రూ.30 వేలతో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం కొనుగోలు చేసి పంపిణీ చేశామన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

రామాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవ కూటివాండ్లపల్లె సమీపంలో బండపై వెలిసిన శివాలయంలో సోమవారం మండల పూజ శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. ఉదయం మహాగణపతి పూజ, మరకత శివలింగానికి పంచలోహ ఉత్సవమూర్తులు, పార్వతి, వినాయకుడు ధ్వజ స్థంభం, నంది విగ్రహాలకు రుద్రాభిషేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, అన్నదానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఖురాన్ పఠనం.. ఇఫ్తార్ విందు ఏర్పాటు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మహిళలు

రాయచోటిటౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం మైనార్టీలు మహిళలకు ఖురాన్ పఠనంతో పాటు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భం గా ముస్లిం మహళలు సామూహికంగా దివ్యఖురాన్ పారాయణం నిర్వహించారు. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా ముస్లిం మహిళలకు ఖురాన్ పఠనం, ఇఫ్తార్ విందును శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మతసామర్యానికి ప్రతీక పవిత్ర పర్వదినం రంజాన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలకు పలువురు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ధరల మోత..కష్టాల్లో చేనేత

● వస్త్రాలు నేయించేందుకు మాస్టర్ వీవర్స్ వెనుకడుగు



సిద్దవటం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ముడిసరుకుల ధరలు పెరిగిన కారణంగా మాస్టర్ వీవర్స్ చేనేత కార్మికులు కష్టాల్లో పడ్డారు. ఉన్న వస్త్రాలను కొనుగోలు చేయకపోవడంతో కొత్త వస్త్రాలు నేయించేందుకు మాస్టర్ వీవర్స్ వెనుకడుగు వేస్తున్నారు. సక్రమంగా పనులు లభించక చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేనేత రంగం కుదేలవుతోంది. సిద్దవటం మండలంలోని మాధవరం చీరలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. మాధవరం-1 ఉప్పరపల్లె, లింగంపల్లె, ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం, కొండమాచుపల్లె గ్రామాల్లో సుమారు 1300కు పైగా చేనేత మగ్గాలుండగా సుమారు 3 వేల మందికి పైగా కార్మికులు చేనేత పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో వెంకటగిరి గ్రామానికి చెందిన 40 మంది వీ వర్స్ ఇక్కడి కార్మికులు చేనేత వస్త్రాలు నేయిస్తున్నారు. ఒక్కో కుటుంబంలో ముగ్గురు నుంచి నలుగురి వరకు పనులు చేసి చీరలు నేస్తున్నారు.

వీరందరికీ నాలుగు రోజుల పనులకు గాను చీరం రకం బట్టి 2 వేల నుంచి 3 వేల వరకు కూలి వస్తుంది. ఇక్కడ నేసిన చీరలను మాస్టర్ వీవర్స్ వెంకటగిరి, హైదరాబాదు, విజయవాడ, ధర్మవరం, రాజమండ్రి, మదనపల్లె తదితర పట్టణాలకు తీసుకెళ్లి వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

చేనేత కార్మికులను నమ్మించి మోసం చేసిన వైసీపీ సర్కార్



అర్హులైన చేనేత కార్మికులకు యేడాదికి 24 వేల రూపాయలు వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేశారు. అయితే ముడిసరుకులు విపరీతంగా పెంచారు. చేనేత కుటుంబాలకు డబ్బు ఇచ్చినట్లే ఇచ్చి అధిక రేట్లు పెంచి ఇచ్చిన డబ్బును గుంజుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేశారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అయినా స్పందించి పెరిగిన ముడి సరకుల రేట్లు తగ్గించి చేనేత కుటుంబాలను ఆదుకోవాలి.

- అవ్వారు రవిశంకర్, చేనేత కార్మికుడు, మాధవరం-1, సిద్దవటం

పనులులేక కార్మికులకు ఇబ్బందులు

చీరలు నేసేందుకు అవసరమైన ముడి సరుకుల ధరలు గత వైసీపీ ప్రభుత్వంలో అధికంగా పెరిగాయి. పట్టు వార్పు (8 చీరల పడుగు) రూ.7500 నుంచి 18 వేల వరకు పెరిగింది. పట్టు, పేక గ్రాము రూ.650 నుంచి 750కు, ఒక మార్క్ జెర్రి రూ.450 నుంచి 550 వరకు ధరలు పెరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు యేడాదికి రూ.24 వేలు ఆర్థికంగా మంజూరు చేసి ముడి సరకుల ధరలు విపరీతంగా పెంచి చేనేతలకు మోసం చేశారు. ముడిసరుకులు పెరిగినప్పటికి కొన్నిరోజులకైనా ధరలు తగ్గుతాయని మాస్టర్ వీవర్స్ కార్మికులు చేనేత చీరలు నేచే పనులు కొనసాగిస్తున్నారు. చేనేత కార్మికుల అష్టకష్టాలను గుర్తించి కూటమి ప్రభుత్వం కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి.

- ఉప్పల రామకృష్ణ, చేనేత కార్మికుడు, మాధవరం-1

ఘనంగా ఆదిభైరవస్వామి ప్రథమ వార్షికోత్సవం



పందికుంటలో ఆదిభైరవస్వామికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు, భక్తులు

గాలివీడు, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందికుంట పంచాయతీ దేవరపల్లిలో వెలిసిన ఆదిభైరవ స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త కానాల భయ్యారెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది మార్చి నెలలో ఆదిభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఒక ఏడాది పూర్తి కావడంతో తిరిగి గ్రామస్తులందరూ స్వామి వారి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కబ్జాదారుల నుంచి పేదల భూములు కాపాడండి



వినతి పత్రం ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి24(ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల నుంచి పేదల భూములు కాపాడాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజులు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన భూమిని ఆన్‌లైన్ చేయించుకొని తన హస్తగతం చేసుకున్న ఆనందరెడ్డిపై రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు జనసేన నాయకులు రామశ్రీనివాసులు, మారుతీవంకర్, రాంప్రసాద్, ఎంఆర్‌పీఎస్ నరసింహులు, ఆంజనేయులు, సిద్దయ్య, శంకర, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు ఎస్పీకి ఆహ్వానం



ఎస్పీని సన్మానిస్తున్న రాయలసీమ కళాపీఠం సభ్యులు

రాజంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) :తెలుగు సంవత్సరాది ఉగాది పురస్కారాలు అందివ్వడానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడిని రాయలసీమ కళాపీఠం సభ్యులు ఆహ్వానించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో రాయలసీమ కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గీతాంజలి రమణ, కార్యవర్గ సభ్యులు సుధాకర్, అబ్బిగారి గోపాల్ ఎస్పీని ఆహ్వానించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి కవులకు, కళాకారులకు, సమాజ సేవకులకు ఉగాది పురస్కారాలు అందజేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఆర్వో ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన

పుల్లంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పుల్లంపేట దళితవాడ ప్రకాష్‌నగర్ కాలనీలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి సోమవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి స్థల పరిశీలన చేశారు. 2023-24లో ఆర్వో ప్లాంటు మంజూరైన నిర్మాణాలు చేపట్టలేదు.దీంతో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి గ్రామస్థులతో మాట్లాడారు. దళితవాడలో మంచినీటికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని గుర్తించి తప్పనిసరిగా ఆర్వో ప్లాంటును మంజూరు చేయాలని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఎస్సీ కార్పొరేసన్ ఈడీని కోరారు. పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

యువత బెట్టింగులకు పాల్పడవద్దు



మాట్లాడుతున్న జనసేన నేత అతికారి కృష్ణ

సిద్దవటం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్ యాప్, లోను యాప్‌లకు అలవాటు పడకూడదని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. మాధవరం-1 గ్రామంలో ఆదివారం రాత్రి కూటమి నేతలు, జనసేన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల యువత బెట్టింగ్‌యాప్‌ల కోసం అప్పులు చేసి తమ జీవితాలను నాశనం చేసుకోవడం శ్రేయస్కరం కాదన్నారు. యువత తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చేలా విద్యారంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కూటమి నేతలు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నికపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్నికపై సోమవారం జనసేన రైల్వేకోడూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఎంపికపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకున్నట్లు తెలిపారు. చాలా మంది అభి ప్రాయాలు తెలిపారన్నారు. రాష్ట్ర అధినాయకత్వానికి తెలిపిన తర్వాత ఎంపిక చే స్తారన్నారు. నాయకులు, కార్యకర్తల ఏకాభ్రిపాయం తీసుకుని నిర్ణయాలు జరుగుతాయని తెలిపారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి టీ.నాగేంద్ర, నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న సాయిలోకేష్

రాజంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తొగురుపేట గ్రామానికి చెందిన గునిశెట్టి రామయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద సోమవారం రూ.49,984ను బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ సమస్యను తెలిపిన వెంటనే స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, సీఎం చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, నాయకులు షబ్బీర్ అహ్మద్, మస్తానయ్య, ఆదినారాయణ, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై నిఘా

సిద్దవటం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. మండలంలోని దేగనవారిపల్లె, మాచుపల్లె, మూలపల్లె క్రాస్ సిద్దవటం తదితర గ్రామాల వద్ద పెన్నానది నుంచి అక్రమ ఇసుక రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ బండికనుమ రహదారిలో తనిఖీలు చేశామని, రాత్రి వేళల్లో కూడా ఇసుక అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపడతామని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన అన్నారు.

శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి: సీఐ

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడినా కఠినమైన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి ఆదేశాల మేరకు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో మైనర్లపై దాడులకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగానే పిల్లలపై వివిధ నేరాలకు ఒడిగట్టిన 13 మందిపై రౌడీషీటర్లగా కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: టీడీపీ

రాయచోటిటౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): నీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామం బాలిరెడ్డిగారిపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి పథకం బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

గాలివీడు, మార్చి24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన గరుగుపల్లి, నూలివీడు పంచాయతీల్లో పర్యటించారు. మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు చిన్నపరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, శివ, హిమాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున, రెడ్డెప్పరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు: ఎస్ఐ



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎస్ఐ

గాలివీడు, మార్చి24(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీ సమయంలో ఆటో డ్రైవర్లకు సంబంధించిన విషయాలను సులువుగా తెలుసుకునేందుకు వీలుగా గుర్తింపు కార్డులను పంపిణీ చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ భాగంలో ఆయన కొన్ని సూచనలు చేశారు. ముందు సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టుకుంటే సహించేది లేదన్నారు. ఆటోలో గుర్తింపు కార్డులు అతికించాలన్నారు. అంతేగాక ప్రతి ఆటో వెనుక క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్‌ను అతికించడంతో ఆటో డ్రైవర్ల సమచారం, ఫోన్ నెంబర్, ఇతర విరాలు సులువుగా తెలుసుకోవచ్చునన్నారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు అమరేశ్వరి

పెనగలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఆక్రమణలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పెనగలూరు తహసీల్దారు అమరేశ్వరి సూచించారు. పెనగలూరు పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురవుతూ కుచించుకుపోతోందన్నారు. సర్వే బృందం సూచించిన కొలతల మేరకు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే మేమే స్వచ్ఛందంగా తొలగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దుకాణదారులు రెండు వారాల వరకు గడువు అడిగారు. కాగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరిన పిటిషన్‌దారుడు ఆదాల నవీన్‌రెడ్డిని కూడా కార్యాలయానికి పిలిపించారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి



లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 24(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో మే నెలలో నిర్వహించే 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి ఆధ్వర్యంలో లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మహాసభలకు యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పెంచలయ్య, మండల కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

నందలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్మూలన కొరకు ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజంపేట డివిజనల్ టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శరత్‌కమల్ పిలుపునిచ్చారు. మండలంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వరి అధ్యక్షతన అంతర్జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆర్‌కేఎస్‌కే కోఆర్డినేటర్ రాజశేఖర్, పాఠశాల స్టాఫ్‌నర్సు కోటీశ్వరమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే సహించేది లేదు : సీపీఐ



పీహెచ్‌సీ డాక్టర్ తౌషిఫ్ అహ్మద్‌తో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పెనగలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్, ఆరోగ్య సిబ్బంది తమ పనితీరు మార్చుకోకుంటే సహించేది లేదని సీపీఐ నాయకులు సోమవారం డాక్టర్లతో అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ, అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు సోమవారం కేంద్రంలో కలియదిరిగారు. అనంతరం డాక్టర్ తౌషిఫ్ అహ్మద్‌తో కలిసి మాట్లాడారు. సీపీఐ బృందం ఇటీవల ఆసుపత్రిలో పర్యటించి డాక్టర్ పనితీరు మార్చుకోవాలని తెలిపినా ఆయన పనితీరులో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ, రేవూరి శంకరయ్య, ఓబులేశు, చలపతి పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని ప్రపంచాన్ని నిర్మిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ మనోజ్‌హెగ్డే

రాజంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలికి ఉండాని, క్షయవ్యాధిలేని ప్రపంచాన్ని నిర్మించేంతవరకు కృషి చేయాలని ఏఎస్పీ మనోజ్ హెగ్డే తెలిపారు. సోమవారం అంతర్జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్, టీబీ మెడికల్ అధికారి డాక్టర్ శరత్, టీబీ సూపర్ వైజర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం ఒక థీమ్‌ను ప్రవేశపెడుతుందన్నారు.డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ మాట్లాడుతూ క్షయవ్యాధి సోకిన వెంటనే గుర్తించి సరైన వైద్యం చేయించకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. క్షయవ్యాధి గ్రస్థుడు తుమ్మినా, దగ్గినా, బ్యాక్టీరియా ద్వారా పక్కవారికి వ్యాపిస్తుందన్నారు. మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి గ్రస్థులకు, రోగులకు ఏఎస్పీ చేతులమీదుగా పౌష్ఠికాహారాన్ని అం దించారు. ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరాజు, ఆర్‌ఎంవో డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్లు సి.సుధాకర్, సునీల్, బాలరాజు, సుబ్బారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.



అన్నమయ్య కాలిబాట

అటకెక్కినట్లేనా?

- రెండు దశాబ్దాలుగా పెరుగుతున్న డిమాండ్
- గతంలో సుముఖత వ్యక్తం చేసిన టీటీడీ
- అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు
- ఆ తర్వాత నోరు మెదపని పాలకులు



మలుపులు లేని శేషాచలం అన్నమయ్య కాలిబాట

రాజంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బాలపల్లె అటవీ ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు అంశం అటకెక్కినట్లుగా కనిపిస్తోంది. కడప, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర వాసులకు ఎంతో ఉపకరించే ఈ మార్గం ఏర్పాటు విషయం గత ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదు. పూర్వకాలంలో తిరుమలకు వెళ్లే భక్తులు అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాక నుంచి బాలపల్లె అటవీ ప్రాంతంలోని మామండూరు, రైల్వేకోడూరు మీదుగా కాలినడకన వెళ్లేవారు. అప్పటి కాలిబాట నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. అటువంటి మార్గంలో రోడ్డు వేయాలని భక్తులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజంపేట ప్రాంతానికి చెందిన వేలాదిమంది కాలినడకన తిరుపతికి వెళ్లి మరీ విజ్ఞప్తి చేశారు. తిరుపతికి వెళ్లి తిరుమలకు చేరుకోవడం అందరూ చేస్తున్న పని. దీంతో తిరుపతిలో రద్దీ పెరిగింది. అదే అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరిస్తే సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఘాట్‌రోడ్డు అవసరమూ ఉండదు. ఒకానొకదశలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఘాట్‌రోడ్డు నిర్మాణంపై సుముఖత వ్యక్తం చేసింది. కాలిబాట పునరుద్ధరణకు కేంద్రం, అటవీశాఖ అనుమతిస్తే పనులు ప్రారంభిస్తామని టీటీడీ గత ఛైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు కూడా. అయితే ఆ ప్రతిపాదన కేవలం ప్రకటనల వరకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్నమయ్య కాలిబాట పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరుపతిలో రద్దీ తగ్గుతుంది



అన్నమయ్య, కడప జిల్లాల అభివృద్ధికి ఎంతో ఉపకరించే అన్నమయ్య కాలిబాటను వెంటనే ఏర్పాటు చేయాలి. శతాబ్దాల కిందటే అన్నమయ్య తాళ్లపాక నుంచి ఏడు కొండల ద్వారా కాలినడకన శ్రీవారి చెంతకు వెళ్లేవారు. ఈ మార్గాన్ని ఏర్పాటు చేస్తే ఎటువంటి రద్దీ ఉండదు. తిరుపతిలో భక్తుల రద్దీ తగ్గి అక్కడ ప్రశాంతత ఏర్పడుతోంది. దూరం తగ్గుతుంది. తిరుపతితో పాటు అన్నమయ్య జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది.

- పీసీ యోగీశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్,



అన్నమయ్య కాలిబాట వెళ్లే శేషాచలం అడవులు

కాలిబాటను ఏర్పాటు చేయాలి



అన్నమయ్య జిల్లా పర్యాటక ప్రాంతంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలంటే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు చేయాలి.. దీంతో అన్నమయ్య భక్తికి సార్థకత చేకూరుతుంది. అన్నమయ్య జిల్లా కూడా తిరుమల తిరుపతిలా పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెంది ప్రపంచంలోనే గుర్తింపు పొందుతుంది. ప్రజా ప్రతినిధులు కాలిబాటలో రోడ్డు ఏర్పాటుకు నడుం బిగించాలి.

- మధుసూదన్‌రెడ్డి, తాళ్లపాక

నీటి సరఫరా పథకాల్లో అవినీతి

- రూ.3.10 లక్షలు దుర్వినియోగం .. ● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై అభియోగాలు నమోదు

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వీరబల్లి మండలం గ్రామీణ తాగునీటి సర ఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ ఎస్.ఇర్ఫాన్ అహ్మద్‌పై ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు సం బంధించిన అభియోగాలు నమోదు చేసింది. ఈ మేరకు ఆయన నుంచి వివరణ కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేసింది. కర్నూలు జిల్లా డోన్ సబ్ డివిజన్ కృష్ణగిరి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈగా పనిచేసే సమయంలో మూడు తాగునీటి సరఫరా పథకాల నిర్మాణాల విషయంలో ఆయన అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం పేర్కొంది. కృష్ణగిరి మండలంలో కటారి కొండకు రూ.19 లక్షలు, కృష్ణగిరికి రూ.17 లక్షలు, తాపలకొత్తూరుకు రూ.17 లక్షలతో మూడు రక్షిత నీటి సరఫరా పథకాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు ఇర్ఫాన్ అహ్మద్ సర్టిఫికెట్లు జారీ చేశారు. దీంతో వంద శాతం చెల్లింపులు చేసేశారు. ఫిర్యాదులు రావడంతో ఆ శాఖ విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగం 2023 సెప్టెంబరు 8న తనిఖీ చేసింది. మూడు పథకాలకు సంబంధించి రూ.3.10 లక్షల విలువైన పనులు ఇప్పటికీ పెండింగులో ఉన్నట్లు గుర్తించారు. ఫలితంగా తాగు నీటి సరఫరా జరిగే అవకాశం లేకుండా అసంపూర్తిగా మిగిలాయి. మొత్తం వ్యవహారాన్ని ఆ శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్ ఈ నెల 22న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. వెంటనే స్పందించి పూర్వాపరాలను పరిశీలించి ఇర్ఫాన్ అహ్మద్ తప్పిదాలను నిర్ధారిస్తూ అభియోగాలపై నోటీసులు జారీ చేసింది. 10 రోజుల్లోగా ఆయన సంజాయిషీ సమర్పించుకునేందుకు గడువిచ్చింది. ఈయనతో పాటు అప్పట్లో డీఈగా పనిచేస్తూ ఈ పనులను పర్యవేక్షించి ప్రస్తుతం ప్రకాశం జిల్లా పొదిలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.సురేష్‌బాబుకు కూడా ఇదే విధమైన నోటీసులు జారీ అయ్యాయి. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఈ మేరకు అన్ని రకాల సాక్ష్యాధారాలతో ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు డీఎల్‌సీఓ తిరుపతికి బదిలీ

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలోడిప్యూటీ రిజిస్ట్రారు హోదాలో వుంటూ ప్రస్తుతం ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న జె.సురేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయనను తిరుపతి డీఎల్‌సీవోగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దంపతుల కేటగిరీ కింద ఆరోగ్య కారణాల రీత్యా తిరుపతిలో ఖాళీగా వున్న డీఎల్‌సీవో పోస్టుకు ఆయన్ను బదిలీ చేశారు. ప్రస్తుతం బదిలీలపై వున్న నిషేధాన్ని మినహాయిస్తూ ఆయన చేసుకున్న దరఖాస్తు మేరకు బదిలీ చేస్తున్నట్లు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

డెప్యుటేషన్‌పై విజయవాడకు కడప మత్స్య శాఖ డీడీ

కడప మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న వి.పెద్దిబాబును డెప్యుటేషన్‌పై విజయవాడకు బదిలీ చేశారు. విజయవాడలో వున్న ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ జనరల్ మేనేజరుగా నియమించారు. ఏడాది కాలం పాటు డెప్యుటేషన్‌లో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మత్స్య శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలో సోమవారం గుర్తు తెలియని యువకుడు ఇంట్లోకి చొరబడి వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లాడు. అరవడానికి వీలు లేకుండా, నోరు నొక్కి ఒత్తిడి చేశాడని, ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి ఉన్నట్లు బాధితురాలు రాజమ్మ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు 35 గ్రాముల చైన్ రెండు లక్షల రూపాయలు విలువ చేస్తుందని ఆమె వివరించింది. ఇ వన్‌టౌన్ సీఐ ఎరిసావలి కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

ఇంట్లో దండించారని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి24(ఆంధ్రజ్యోతి)ఇంట్లో దండించారని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని రాజానగర్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు బన్నీ (19) ఇంటర్ పస్ట్ ఇయర్ చదివి ఇంట్లో ఖాళీగా ఉన్నాడు. జులాయిగా తిరుగుతుండడంతో సోమవారం తల్లి పార్వతి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకుతో గొడవపడి తండ్రి..

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కొడుకుతో గొడవపడి ఓ తండ్రి ఆత్మహత్యా యత్నం చేశాడు. మదనపల్లె పట్టణం, విజయనగర్ కాలనీకి చెందిన కృష్ణప్ప(60) ఆవులకు మేత తీసుకురావాలని తన కొడుకుకు సూచించాడు. అతను వెళ్లకపోవడంతో గొడవపడ్డాడు. దీంతో ఆవేశానికి లోనై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె టూ టౌన్ పోలీసులు కేసును విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు ఆదివారం రాత్రి మండలంలోని గంగన్నగారిపల్లెకు చెందిన మధు, తన భార్య లక్ష్మి వాదులాడుకుంటుండగా పక్కనే మద్యం తాగుతున్న ముగ్గురు యువకులు అతనిపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

చిప్పిలిలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల దాడిలో ముగ్గురు యువకులు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామంలో కొందరు యువకులు సోమవారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో లడ్డు అనే యువకుడు జంగాలపల్లెకు చెందిన ఆదికేశవ(40), వేంపల్లెకు చెందిన చరణ్(30), అవకిశెట్టిపల్లెకు చెందిన సుమంత్(30)ను రాళ్లతో కొట్టి గాయపర్చాడు. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదికేశవ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

రామాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత రామాపురానికి చెందిన వెన్నుపూస నరేంద్ర తన కమారుడు యస్విక్‌ప్రసాద్‌తో కలసి సోమవారం బైక్‌లో రాయచోటి నుంచి రామాపురానికి వస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో కడప నుంచి వస్తున్న కారు ముందు వస్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెక్కల కొండకు నిప్పు



మంటల్లో కాలిపోతున్న రెక్కలకొండ

పెద్దమండ్యం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) మండలంలో రెక్కల కొండ అడవికి సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వందల ఎకరాలు అటవీ ప్రాంతం కాలి బూడిద కాగా వన్య ప్రాణులు అగ్నికి ఆహుతైనట్లు పలువురు వాపోతున్నారు. అడవిలో నిప్పు పశువుల కాపరుల పనేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా అటవీ అధికారులు చర్యలు తీసుకొని నిప్పుబారి నుంచి అడవిని కాపాడాలని ప్రజలు కోరారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ



రాయచోటి: అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



కడప: వికలాంగుడి సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యో తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్ర జా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుం చి వచ్చిన ఫిర్యా దుదారులతో ముఖాముఖి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేసి నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు తమకు సమీపం లోని పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

కడప క్రైం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యమిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసు స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదు లను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్ బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను తక్షణమే పరిష్కరించాలి: సబ్ కలెక్టర్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి

రాజంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలపై విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కారవేదిక కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఏవైనా చిన్న సమస్యలు పరిష్కరించకుండా కార్యాలయాల చుట్టూ బాధితులను తిప్పుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.12 లక్షలు మోసం చేసిన మూలగంగమ్మ డ్వాక్రా గ్రూపు లీడర్ షేక్. మౌలాబీపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరానికి చెందిన మూలగంగమ్మ తల్లి డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్ షేక్. మౌలాబీ తప్పుడు సంతకాలతో కడప డీసీసీ బ్యాంకులో రూ.12 లక్షలు డ్రా చేసిందన్నారు. డబ్బులు కట్టాలని బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులను అడగడంతో విషయం బయటపడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేసన్ జిల్లా కమిటీ సభ్యులు రమణ, సుజాత తదితర కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు

నిమ్మనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కేబుల్ వైర్ల దొంగలు వీరవిహారం చేస్తున్నారు. దాదాపు వారం రోజులుగా రాత్రి వేళల్లో నిమ్మనపల్లి, వెంగంవారిపల్లి, అగ్రహారం పంచాయతీలోని వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న దాదాపు 1000 మీటర్ల కేబుల్ వైర్లను చోరీకి గురికాగా, ఆదివారం రాత్రి మాత్రమే 25 బోర్లకు చెందిన కేబుల్ వైర్లను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది.

దీని విలువ దాదాపు రూ.లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. తిరిగి కేబుల్ ఏర్పాటు చేసుకునేందుకు 10 రోజులు పడుతుందని, ఈ లోగా పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీనిపై సోమవారం వెంగళకురవపల్లికి చెందిన రైతు హరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక్క రోజు రాత్రి మాత్రమే మూడు గ్రామాల్లో కేబుల్ వైర్లు చోరీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజుల క్రితం పోలీసులు ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండుకు తరలించారు. అయినా దొంగలు కేబుల్ తీగలనే టార్గెట్‌గా పెట్టుకుని పోలీసులకే సవాల్ విసురుతున్నారు.

తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం

- వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి



తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన అచార్యులు ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు రెండో విడత తైక్వాండో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణను పెంపొందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు నాగూర్‌బాబు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి డీవీ రంగరాజు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి డీవీ రంగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. ముఖ్యంగా కర్మాగారాలు, ప్యాక్టరీలు, దుకాణాల సంస్థల్లో పనిచేసే కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలని, పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్, ఫ్లూయిడ్స్ అత్యవసరమైన మందులను అదుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని, కార్మికులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని కర్మాగారాలు, ఫ్యాక్టరీ యజమానులు, దుకాణదారులకు ఆదేశించారు.

పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్!

- వేంపల్లిలోని పరీక్ష కేంద్రాల్లో డీఈఓ షంషుద్దీన్ తనిఖీ

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష సరళిపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక బాలుర, బాలికల హైస్కూళ్లలోని నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తుండగా మాస్ కాపీయింగ్ జరుగుతోందంటూ ఫిర్యాదులు అందడంతో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓ పరీక్ష కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని ఫిర్యాదు అందడంతో డీఈవో సంబంధిత గదిలోని విద్యార్థులను తనిఖీ చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులపై ఇన్విజిలేటర్లను, ఎంఈఓలను అప్రమత్తం చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా తప్పు జరిగితే కఠిన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చ రించారు. అయితే డీఈఓ తనిఖీలపై పలువురు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనిఖీలు చేశారని, దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురై, జవాబులు మరచిపోయి, పరీక్ష సరిగా రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంటే పట్టుకోవాలి తప్ప భయంగొలిపే విధంగా అక్కడే ఉండి తనిఖీలు చేయడం ఏమిటని వాపోతున్నారు. ఫిర్యాదులు అందడం వల్లే తనిఖీలు చేశామని, వేంపల్లెతో పాటు బి.మఠం, కందిమల్లాయపల్లె, చక్రాయపేట మండలాల్లో ఫిర్యాదులు అందాయని, అన్నిటిపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు.

రైల్వే కోడూరులో..

రైల్వేకోడూరు రూరల్: పట్టణంలోని పది పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరోపించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థ విద్యార్థులు ఐడెంటిటీ కోసం చేతులకు ఎరుపు రంగు బ్యాడ్జీలు ధరించి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వీరిపట్ల ఇన్విజిలేటర్లు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న విద్యాసంస్థలు, ఇన్విజిలేటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో భాష్యం విద్యా సంస్థల్లో ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్‌కు వివిధ విభాగాలకు చెందిన 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 19 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిని వైవీయు అధికారులు అభినందించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సభ్యుడు డాక్టర్ గణేష్ నాయక్, భాష్యం విద్యాసంస్థల రాయలసీమ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాగ్నిజెంట్ కంపెనీలో

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



కాగ్నిజెంట్ సంస్థకు ఎంపికైన విద్యార్థులు

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన కాగ్నిజెంట్ ఐటీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. 25 మందికి ఉద్యోగాలు రాగా ఇందులో రూ.4.50లక్షల వేతనం కొందరు, రూ.5 నుంచి రూ.7లక్షల వరకు వేతనానికి మరి కొంతమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆహ్వానం మేరకు కాగ్ని జెంట్ ఐటీ సంస్థ ఈ క్యాంపస్ సెలక్షన్లను నిర్వహించడం మంచి పరిణామమని డైరెక్టర్ గుప్త అన్నారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినం దించారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాష్, ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు వినోద్, సుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామిరెడ్డికి డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా సెండ్ బాక్స్ కల్లూరి రఘురామిరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఊబకాయం, మధుమేహం ఆహారంతోనే తగ్గించే విధంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం లభించింది. నెంబర్ గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్ జర్మనీ జార్జ్ ఫ్రెండ్ పీటర్, నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కాపీర్వెల్, డాక్టర్ కిమ్, డాక్టర్ ఎ.గోపి కన్నన్‌చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

హుండీ ఆదాయం రూ.8 లక్షలు

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.8,15,239 వచ్చినట్లు ఈవో క్రిష్ణానాయక్ తెలిపారు. గంగమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని భక్తుల సమక్షంలో సోమవారం లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందని, ఈ ఆదాయాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మారుతీప్రసాద్, మహదేవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పుల్లయ్య, నాగమల్లారెడ్డి, లక్ష్మిదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బట్టా కిశోర్‌బాబు (30) మృతి చెందాడు. తీవ్రగాయాలైన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తీసుకెళ్లగా సోమవారం సాయంత్రం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు మండలంలోని గూడెంచెరువు రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనిచేసుకుని జీవించేవాడన్నారు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

బ్యాడ్మింటన్ చాంపియన్స్‌గా నాగరాజు-నితిన్ జోడీ

కడప స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర ఫక్కీరుపల్లె వీవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలలో నాగరాజు- నితిన్ జోడీ విజేతగా నిలిచింది. సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు న్యాయమూర్తి రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. కాగా టోర్నమెంట్ రన్నరప్‌గా నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి జోడీ నిలిచింది. ఇదిలావుండగా అంతర్జాతీయ అంపైర్‌గా బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న జిలానీబాషాను ఈ సందర్భంగా సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు

కాశినాయన మార్చి23(ఆంధ్రజ్యోతి) అదనపు కట్నం కోసం కుటుంబ సభ్యులతో కలిసి భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపించి మరో యువతిని గుడిలో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మిద్దెల ఎస్సీకాలనీకి చెందిన ఎర్రబల్లె ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కూతురు సంధ్యను 2023 మే నెలలో కమలాపురం మండలంలోని జి.అప్పాయపల్లెకు చెందిన కుందూరు ఓబులేసు కుమారుడు అనంతరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీఆర్వోగా పని చేస్తున్న అనంతరాజు పెండి చేసుకున్న కొన్నినెలలకే కుటుంబ సభ్యులతో కలిసి భార్య సంధ్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధించడం మొదలు పెట్టాడు. వారి బాధలు భరించలేక సంధ్య పుట్టింటికి చేరింది. ఇదే అదనుగా భావించిన అనంతరాజు అదే సంవత్సరం నవంబరు నెలలో బీర అంజలి అనే వేరొక యువతిని పుష్పగిరి ఆలయంలో గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య సంధ్య భర్త అనంతరాజుతో పాటు బీర అంజలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బీరం అంజలి మహిళా పోలీసుగా పనిచేస్తున్నట్లు సమాచారం.



తమలపాకు సాగు.. ధర బాగు..



రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట



దువ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నోరు పండించే తమలపాకు ధరలు మండుతున్నాయి. సాగు చేసిన రైతులు ఆనందపడుతున్నారు. గత కొంత కాలంగా మార్కెట్ ధరలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. దువ్వూరు మండలంలో విరివిగా తమలపాకు పంట సాగు చేశారు. రాంసాయినగర్, క్రిష్ణంపల్లె, కానగూడూరు, దువ్వూరు ప్రాంతాల్లో సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఎకరాలో పంట సాగు చేయాలంటే రూ.2 లక్షల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ పైరుకు నిత్యం కూలీల అవసరం ఉంటుంది. పరిస్థితులు సహకరించితే సరి.. లేదంటే వైరస్ తెగుళ్లు ఆశిస్తాయి. ఇక ప్రకృతి వైపరీత్యాలు అప్పుడప్పుడు దాడి చేసి తోటలను ధ్వంసం చేయడం లాంటి సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితులు తలెత్తినప్పుడు రైతులు నష్టాలను మూటగట్టుకోవడం పరిపాటిగా మారుతుంది. ఇటువంటి విపత్కర పరిస్థితులను దాటుకుంటూ రైతులు ముందుకెళుతున్నా ఆశించిన ధరలు లేకపోతే రైతులు నష్టాలపాలవుతారు. రెండేళ్లుగా ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ధరలు పర్వాలేదనిపించినా ఆటుపోట్లు తప్పడం లేదు. దువ్వూరు ప్రాంతం నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, కర్నూలు ప్రాంతాలకు తమలపాకు కట్టలను బుట్టల్లో తరలిస్తున్నారు. బుట్టలో 22 నుంచి 25 కట్టలను ఉంచి ప్యాకేజీ చేసి తరలిస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో బుట్ట వెయ్యి రూపాయల నుంచి రూ1400 ధర ఉందని రాంసాయినగర్‌కు చెందిన చలపతి అనే రైతు తెలిపారు.

రైతులు ఇప్పుడే ఊపిరిపీల్చుకుంటున్నారు

● రైతులను నష్టపరిచింది వైసీపీ.. అండగా ఉన్నది టీడీపీ
● జగన్‌ది పరామర్శ యాత్ర కాదు.. జైత్రయాత్ర ● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వడగండ్ల వాన, ఈదురుగాలులకు లింగాల మండలంలో దాదాపు 3వేల ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని, ఆ వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఏ రైతుకు ఎంత నష్టం జరిగిందనే విషయం స్పష్టంగా తేల్చి నష్టపరిహారం అందించే చర్యలు త్వరతగతిన చేపడుతుందన్నారు. ప్రభుత్వం ఇంతలా రైతులను ఆదుకోవాలని చర్యలు చేపడితే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లింగాలలో పర్యటించి నాలుగేళ్లు కళ్లుమూసుకోండి.. మన ప్రభుత్వం వస్తుందని రైతులకు చెబుతున్నారన్నారు. అప్పుడు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెబుతున్నారని, నష్టం ఇప్పుడు జరిగితే నాలుగేళ్ల తర్వాత ఆదుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు బాధల్లో ఉంటే వారికి ధైర్యం, ఓదార్పు ఇవ్వాల్సింది పోయి పర్యటన అంతా జైత్రయాత్ర మాదిరి ఉందన్నారు. 2014-19 కాలంలో రైతులందరికీ అరటి మొక్కలు ఉచితంగా ఇచ్చామని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం ఎస్సీ ఎస్టీలకే ఉచితంగా ఇచ్చారన్నారు. పులివెందులలో రూ.25కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటుచేసిన మాట వాస్తవమే అయినా రూ.10కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా ప్రారంభించారని, కనీసం బోరు లేదు, జనరేటరూ లేదన్నారు. ఆ పెండింగ్ బిల్లులను ఈ ప్రభుత్వం చెల్లించి మెయింటెనెన్స్ చేసేందుకు ఏజెన్సీలను కూడా పిలవడం జరుగుతుందన్నారు. ఈనెల 28న కలెక్టర్ వద్ద ప్రీబిడ్ జరుగుతుందన్నారు. త్వరలో కోల్డ్‌స్టోరేజ్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. విషయాలు తెలుసుకొని మాట్లాడాలని, కేవలం విమర్శలు చేసి వెళ్లిపోతే సరిపోదన్నారు. రైతులు, ప్రజలంతా జరిగినవన్నీ గమనిస్తూనే ఉన్నారన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

● బైకు స్వాధీనం

కడప క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం కాలసముద్రానికి చెందిన షేక్ మౌలాలి పార్కింగ్ చేసిన బుల్లెట్ వాహనాలను చోరీ చేశాడని, ఈ మేరకు మౌలాలిని అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మరికొందరు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు నగర శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై, గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నకాశ్, సాయిపేట, ఉక్కాయపల్లె, మార్కెట్‌యార్డు, పాతకడప, మార్కెట్‌యార్డు వద్ద ఉన్న శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

వేసవి సమస్యలను అధిగమిద్దాం : డీఆర్వో

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీరు, అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా వడదెబ్బ సమస్యలను అధిగమించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో తాగునీటి కొరత, వేసవిలో వడగాల్పులు, వడదెబ్బ ముందస్తు జాగ్రత్తలపై జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్‌తో కలసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతతలు నమోదవుతున్నాయని, దీనిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మండలాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏఎన్ఎంలతో కలసి వడగాల్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో షెడ్లు, మంచినీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. అటవీ పరిరక్షణ ప్రాంతాల్లో పశు, పక్ష్యాదులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రథమ చికిత్స ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

25, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

● పటిష్టంగా నిర్వహించాలి : డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 27వ తేదీల్లో జరుగు ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్ట బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే నాలుగు విధాల నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్షల నిర్వహణపై డీఆర్వో ఏపీపీఎస్సీ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, మానిటర్ షేక్ ఖాసీంవల్లితో కలసి అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 25, 27వ తేదీల్లో ఉదయం 9-30 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి పరీక్షలను సజావుగా జరపాలన్నారు. జిల్లాలో చింతకొమ్మిదిన్నె మండల పరిధిలో 3, చాపాడు మండలంలో-1, ప్రొద్దుటూరు-1 పరీక్షా కేంద్రాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు, పరీక్షల నిర్వహణకు సంబందించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోవిందమాంబ ఆరాధనోత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేందస్వామి మఠంలో భక్తిశ్రద్ధలతో సోమవారం మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబ పరమేశ్వరి అమ్మవారి జీవసమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం సోమవారం క్రోధినామ సంవత్సర ఫాల్గుణ బహుళ దశమి రోజు కావడంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మధ్యాహ్నం ద్వార పూజ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి విశ్వబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి, విశ్వబ్రాహ్మణ భక్తుడు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పట్టుచీర, సారెను పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులకు అందించారు. రాత్రికి అమ్మవారిని మాఢవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.



అమ్మవారికి సారె సమర్పించిన విశ్వ బ్రాహ్మణ కమిటీ భక్తులు

ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీ

● ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడి మృతి
● మహిళకు తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో కలమల్ల గ్రామ శివార్లలో సోమవారం సాయంత్రం ఈకో వ్యాన్ ద్విచక్రవానాన్ని ఢీకొన్న సంఘటనలో కలమల్లకు చెందిన ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు రాజారెడ్డి(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వివరాల్లోకెళితే.. ఆర్టీపీపీ 600ప్లాంట్ యాష్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న రాజారెడ్డి తన భార్య సుజాతతో కలిసి ఎలక్ట్రిక్ స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళుతున్నాడు. వెనుకవైపు నుంచి అతి వేగంగా వచ్చిన మారుతిసుజుకి ఈకో వ్యాన్ ఢీకొట్టి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో స్కూటీలో వెళుతున్న రాజారెడ్డి, ఆయన భార్య కిందపడ్డారు. రాజారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కలమల్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ సుజాతను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించారు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చల్లంగా చూడమ్మా.. గంగమ్మతల్లి

● వైభవంగా పాలగిరి గంగమ్మ జాతర
● తరలివచ్చిన భక్తులు



వీరపునాయునిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరిలో గంగమ్మజాతర వైభవంగా నిర్వహించారు. భారీఎత్తున భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జంతుబలులు ఇచ్చారు. డప్పువాయిద్యాల మధ్య బాణసంచా పేల్చుతూ బోనాలు సమర్పించారు. బంధువులను స్నేహితులను ఆహ్వానించి విందుభోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి సిరిమాను బండిని ఎద్దులతో తిప్పారు. ఈ సిరిమాను ఉత్సవాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. జాతర సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఐటీడీపీ సూర్యనారాయణరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కుంటకట్ట సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి వద్ద చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పవన్‌కృష్ణ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం

● న్యాయవాదుల శిక్షణలో జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీదేవి



కడప రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇందుకు న్యాయవాదుల తోడ్పాటు చాలా అవసరమని, కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి కూడా వీలుపడదన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ వీజీ సురేష్, జి.జ్యోతి తదితరులు మధ్యవర్తిత్వం, ప్రాథమిక నియమాలు, అభ్యాస సూత్రాలు, వయోజన అభ్యాసం, పౌర విధాన నియమావళి 1908 తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఓ మహిళ పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ చేసింది. సినిమా ఫక్కీలో మూట ముట్టుకోకూడదని బంగారం అపహరించింది. బాధితురాలి వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీలో కారపాకుల సుజాత, చంద్రశేఖర్ దంపతులు జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు చంద్రలావణ్యకు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో ఇందుకు పూజలు చేస్తే తగ్గుతుందని స్థానిక మహిళ ఓ అపరిచితురాలి గురించి చెప్పింది. దీంతో సోమవారం మధ్యాహ్నం ఆ అపరిచిత మహిళను ఇంటికి పిలుచుకుని ఒంటి గంట సమయంలో పూజ చేయించారు. పూజలో భాగంగా ఇంటిలో ఉన్న బంగారు లేదా వెండి వస్తువులు రెండు బాక్సుల్లో పెట్టాలని సూచించడంతో తమ ఇంటిలో ఉపయోగించని బాక్సులు లేవని చెప్పారు.

పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న రెండు బాక్సులను సంచిలో నుంచి తీసి అందులో ఆ బంగారం, వెండి వస్తువులు పెట్టాలని తెలిపింది. ఈ మేరకు ఒక బాక్సులో 15 తులాల బంగారం, ఇంకో బాక్సులో బియ్యం తదితర పూజా సామగ్రి పెట్టిందని, పూజ ముగిసిన తర్వాత ఒక డబ్బా తమకు ఇచ్చి సాయంత్రం వరకు తెరిచి చూడకూడదని సూచించిందన్నారు. అనంతరం ఆ మహిళను చంద్రశేఖర్ తన స్కూటీలో తీసుకెళ్లి తాడిపత్రి రోడ్డు బస్టాపు వద్ద దింపాడు. ఇంటికి వచ్చిన బాక్సు తెరిచి చూస్తే అందులో బంగారం లేదని, బంగారం బాక్సును అపరిచిత మహిళ తీసుకెళ్లిందని గ్రహించారు. దీంతో తాము మోసపోయామని తెలుసుకుని బోరున విలపిస్తూ పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. అపరిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై నిఘా

సిద్దవటం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. మండలంలోని డేగనవారిపల్లె, మాచుపల్లె, మూలపల్లె క్రాస్ సిద్దవటం తదితర గ్రామాల వద్ద పెన్నానది నుంచి అక్రమ ఇసుక రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ బండికనుమ రహదారిలో తనిఖీలు చేశామని, రాత్రి వేళల్లో కూడా ఇసుక అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపడతామని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన అన్నారు.

శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి: సీఐ

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడినా కఠినమైన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి ఆదేశాల మేరకు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో మైనర్లపై దాడులకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగానే పిల్లలపై వివిధ నేరాలకు ఒడిగట్టిన 13 మందిపై రౌడీషీటర్లగా కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు.

పోక్సో కేసు నమోదు

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. జమ్మలడుగు ఆదివారం రాత్రి బాలిక(10)పై 58 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్షయ నివారణకు కృషి చేద్దాం

క్షయ వ్యాధి నివారణ దినోత్సవం ● మార్మోగిన 'అందరి పంతం టీబీ అంతం' నినాదం
ర్యాలీలు, ప్రదర్శనలతో మానవహారం ● ప్రతిజ్ఞ చేసిన అధికారులు, ప్రజలు

వాల్మీకిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో టీబీ ముక్త్ భారత్ పంచాయతీకి ఎన్నికైన యూనిట్ పరిధిలోని మంచూరు, తాటిగుంటపల్లె, కలికిరి మండలం మున్నేళ్లపల్లె, నిమ్మనపల్లె మండలంలో కొండయ్యగారిపల్లె, తవళం పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం టీబీ అంతం మన పంతం నినాదాలతో పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పద్మావతి హెల్త్ సర్వీస్ సొసైటీ ద్వారా క్షయ బాధితులకు పోషకాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, స్థానిక డాక్టర్లు సోని, శివాణి, హిమబిందు, రవి, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ స్వాతి చక్రపాణి, పద్మావతి హెల్త్ సర్వీస్ సొసైటీ డాక్టర్ సోమశేఖర్, చరిత, గోవిందమ్మ, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అందరి పంతం టీబీ అంతం

పీలేరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి



వాల్మీకిపురంలో పోషకాహారం అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు





పీలేరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది - మదనపల్లెలో చేపట్టిన అవగాహన కార్యక్రమం

ఒక్కరూ టీబీ అంతానికి కృషి చేయాలని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి, టీబీ యూనిట్, రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల సిబ్బంది క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. టీబీ బాధితులకు 'డాట్' సేవలందించిన 25 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలు, మొమెంటోలు బహూకరించారు. అనంతరం పట్టణంలో టీబీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎంఓ సరస్వతమ్మ, డాక్టర్ నాగవేణి, డాక్టర్ కేశవులు, డాక్టర్ కరీముల్లా, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో

మదనపనల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులతో, ఆరోగ్యవరం సిబ్బంది ర్యాలీ చేపట్టారు. జిల్లా ఆస్పత్రి టీబీ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్చనబాబు, ఆర్‌ఎంఓ డాక్టర్ సుకుమార్ అధ్యక్షతన ఆరోగ్యవరం నుంచి తురకపల్లె మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ధాత్రి ఫౌండేషన్ వారు 50 మందిని దత్తత తీసుకుని క్షయనుంచి విముక్తి కల్పించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతి తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె టీబీ విభాగ సిబ్బంది ప్రభాకర్, శాంతి, వనజకుమారి, ఆరోగ్యవరం సిబ్బంది నెల్సన్, సౌందర్య, క్రిస్టినా, సురేష్, మోసెస్, ఏసుదాస్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ములకలచెరువులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ర్యాలీ

ములకలచెరువులో...

ములకలచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి బస్టాండు సర్కిల్ ప్రదర్శన చేపట్టారు. వైద్యాధికారి జాహ్నవి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉంటే ప్రభుత్వాస్పత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం

తంబళ్లపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణకు ప్రతి ఒక్కరం కృషిచేద్దామని టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణనాయుడు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి నుంచి వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి క్షయ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు విక్రాంత్‌రెడ్డి, అమరసింహరాజు, సుమలత, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టీ గిరి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ సుకుమార్‌పై ప్రైవేట్ కేసు వేస్తా

● రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న సురేంద్రయాదవ్

కురబలకోట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తనపై అక్రమ కేసులు నమోదు చేసిన ఎస్‌ఐ సుకుమార్‌పై ప్రైవేట్ కేసు నమోదు చేయిస్తానని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ అన్నారు. అంగళ్లులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను నిలదీయడంతో కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్‌ఐ సుకుమార్ అధికార నేతలకు అడుగులకు మడుగులొత్తి తనను రాజకీయంగా అణగదొక్కడానికి అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. 2019లో టీడీపీ కార్యకర్తను విడిపించేందుకు వెళ్లగా రెండోనిందితుడిగా తనపై కేసు నమోదు చేశారన్నారు. 2021లో విశ్వం కళాశాల సమీపంలో నా సొంత స్థలంలో టీడీపీ ప్రస్తుత కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ సమావేశం నిర్వహించగా అనుమతులు లేవని కేసు నమోదు చేశారన్నారు. ముదివేడు పంచాయతీ గొళ్లపల్లె వద్ద మా కోళ్ల ఫామ్, విశ్వం కళాశాల సమీపంలోని నా స్థలంలో వాళ్ళే మద్యం బాటిళ్లను పెట్టి నాపై కేసులను నమోదు చేశారన్నారు. అయితే రాజకీయ దురుద్దేశంతోనే తప్పుడు కేసులు నమోదు చేశారని నిర్ధారిస్తూ కోర్టు కేసులను కొట్టేసిందన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసిన ఎస్‌ఐ సుకుమార్‌పై ప్రైవేట్ కేసు వేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అంగళ్లులో బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ పంపిణీ చేశారు. మండలంలోని అంగళ్లు వాసి మునాచారి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో డబ్బు ఖర్చు చేశాడు. దీంతో ఆయన పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి ఆయనకు సీఎంఆర్‌ఎఫ్‌ను మంజూరు చేయడంతో ఆ చెక్కును ఆయనకు అందజేశారు.

దుర్వినియోగమైన సొమ్ము రాబట్టాలి



పీలేరు పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

పీలేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో దుర్వినియోగం జరిగినట్లు విచారణలో రుజువైన రూ.1.40 కోట్ల నిధులను బాధ్యుల నుంచి వసూలు చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ స్వాహా చేసిన సొమ్మును సర్పంచు నుంచి రాబట్టి ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని స్పష్టం చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. దుర్వినియోగమైన నిధులను వసూలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పంచాయతీ అభివృద్ధి కోసం ప్రజలు చెల్లిస్తున్న పన్నులను సర్పంచు స్వాహా చేయడాన్ని వారు దుయ్యబట్టారు. దుర్వినియోగంలో బాధ్యులైన సంబంధిత అధికారులను ఇప్పటికే ముగ్గురిని సస్పెండు చేయడం, సర్పంచు చెక్ పవర్ రద్దు చేశారని గుర్తు చేశారు. తొమ్మిది మాసాలవుతున్నా నిధుల రికవరీ కోసం ప్రయత్నించకపోవడాన్ని వారు తప్పుబట్టారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్, ఏఐటీయూసీ కార్యదర్శి నరసింహులు, ప్రజా నాట్య మండలి నాయకులు గుర్రప్ప, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవకుమార్, ఏపీ రైతు సంఘం నేతలు భాస్కర్ రెడ్డి, పరదేశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం నడివీధి గంగజాతరకు సర్వం సిద్ధం



పీటీఎంలో ఊరేగుతున్న గంగమ్మ, పోతులరాజు

పెద్దతిప్పసముద్రం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎంలో నేడు రేపు అత్యంత వైభవంగా నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక సంతబజారులో అత్యంత శక్తి వంతమైన నడివీధి గంగమ్మను నేడు ప్రతిష్ఠించనున్నారు. ఏటా పీటీఎంలో నిర్వహించే పండుగల్లో గంగజాతర ఒకటి రెండు రోజులు నిర్వహించను న్న జాతరకు కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు పాల్గొంటారు. కాగా మంగళవారం రాత్రి జరిగే నడివీధి గంగ మ్మ జాతరలో విద్యుత్ దీపాలతో అలంకరించిన అమ్మవారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. బుధవారం పగలు తిరునాళ్లను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు వస్తారు. బుధవారం మధ్యాహ్నం అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

వేలం ద్వారా రూ.3.95లక్షలు ఆదాయం



వేలం నిర్వహిస్తున్న డీఎల్పీఓ నాగరాజు

తంబళ్లపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో దినసరి మార్కెట్టు, ప్రైవేటు బస్టాండు(ఆర్టీసీ మినహా) గేటు వసూలు హక్కును ఏడాది పాటు పొందడానికి నిర్వహించిన వేలం ద్వారా రూ.3.95 లక్షలు ఆదాయం చేకూరినట్లు కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్ నీలూఫర్‌ఖైనుద్దీన్, డీఎల్పీఓ నాగరాజు, ఈఓఆర్డీ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. తంబళ్లపల్లె వాసి బీకే మహేష్ రూ.3.95 లక్షలకు వేలంలో హక్కులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

పీటీఎంలో రూ 1,11,300 ఆదాయం

పెద్దతిప్పసముద్రం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం పంచాయతీకి వేలం ద్వారా రూ.1,11,300 ఆదాయం చేకూరినట్లు పంచాయతీ కార్యదర్శి విద్యావతి పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సంతగేటు, బస్టాండుగేటు, జంతువధశాలలకు సర్పంచ్ తమకశంకర, ఈఓపీఆర్డీ మోహన్‌ప్రతాప్ అధ్వర్యంలో వేలం నిర్వహించగా ఇందులో సంతగేటుకు ఎం. వజీర్ రూ. 46,500 దక్కించుకున్నాడు. బస్టాండుగేటును చింతకాయల లక్ష్మీపతి రూ. 47,300 దక్కించుకున్నాడు. జంతువధశాలను ఏరుకాలువ గంగాద్రి రూ. 17,500కు దక్కించుకున్నారు. దీంతో పంచాయతీకి ఆదాయం రూ1,11,300 చేకూరినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు ములకలచెరువులో ...

ములకలచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం వారపు సంత వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ మోహన్‌ప్రతాప్, కార్యదర్శి ఆజాద్ తెలిపారు. పీటీఎం రోడ్డులో జరిగే వారపు సంతలో రుసుం వసూళ్లకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపు కోసువారిపల్లె వారపు సంత, చేపల చెరువు వేలం

తంబళ్లపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లె పంచాయతీలో వారపు సంత, బయ్యమ్మ చెరువులో చేపలు పట్టుకునేందుకు 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోసువారిపల్లె పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి బకాయిలు ఉండకూడదన్నారు. హెచ్చు పాటదారుడు మొత్తాన్ని వారం లోపు స్టాంపు డ్యూటీతో కలిపి చెల్లించాలన్నారు. ఆసక్తి గల వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోండి



బొంతవారిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రేమలత

పెద్దతిప్పసముద్రం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు ఈ క్రాప్ నమోదును తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రేమలత రైతులకు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోందిలో భాగంగా సోమవారం ఆమె రంగసముద్రం పంచాయతీ బొంతవారిపల్లెలో స్థానిక రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రబీ సీజన్‌లో సాగైన వరి, వేరుశనగ, టమోటా పంటలకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టం జరిగే రైతులకు పంట బీమా వర్తించాలంటే ప్రతి రైతు తప్పని సరిగా రైతుసేవా కేంద్రాల్లో ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ అందాలంటే రైతులు రైతుసేవా కేంద్రాల్లో పేరును నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె విద్యా డివిజన్‌లో ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కోరారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ నిమ్మనపల్లె మండలంలో అనుమతులు పొంది అక్కడ పునాదులు నిర్మించిన ఓ ప్రైవేటు పాఠశాల, మదనపల్లెలో అద్దె భవనాల్లో విద్యార్థుల అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. డివిజన్‌లో పలు ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిపై విద్యాశాఖ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లె మండలం బీకేపల్లె చంద్రాకాలనీలో 20 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకుని నివశిస్తుండగా గతంలో రెవెన్యూ అధికారులు వాటిని తొలగించారన్నారు. ఇప్పుడు ఆ స్థలాలను కొందరు రియల్ వ్యాపారులు లేఅవుట్‌లు వేసి విక్రయిస్తున్నారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని పేద ప్రజలు విన్నవించారు. వచ్చిన అర్జీలపై నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఎంపిక పారదర్శకంగా ఉండాలి : టీడీపీ

ములకలచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారధుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని టీడీపీ నేతలు తులసీధర్‌నాయుడు, విశ్వనాధరెడ్డి, బండి యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండల టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారినే సాధికార సారధులుగా ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, మాజీ మండల అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ నేతలు చల్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గంగాధర్, మస్తాన్, శివరాం, జయరామ్‌రెడ్డి, కృష్ణమూర్తి, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యం



ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మండిపడ్డారు. సోమవారం కురవంక సచివాలయం, పట్టణంలోని 28వ వార్డు సచివాలయాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. కురవంకలో ఇద్దరు సచివాలయ సిబ్బంది రిజిస్టర్‌లో సంతకాలు చేసినా విధుల్లో లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహించారు. కనీసం మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయకపోవడంపై ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌ను విచారణకు ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు.

ఉపాధి పనుల వివరాలు ఇవ్వండి



సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు అడుగుతున్న జనసేన నేత

నిమ్మనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి పంచాయతీలో ఉపాధి ద్వారా చేపట్టిన పనుల వివరాలు ఇవ్వాలని జనసేన మండల ఉపాధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ సోమవారం ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి సమాచారహక్కు చట్టం ద్వారా వినతిపత్రం అందిచారు. ఆయన మాట్లాడుతూ 2020-21, 2023-24కు సంబంధించి నిమ్మనపల్లి వారపుసంత, నాబర్డు నిధుల మంజూరు ఆదాయం, ఖర్చువివరాలు, మండలంలో జరుగుతున్న ఉపాధిలో ఫారంపాండ్, హార్టికల్చర్, రైతుకు గడ్డిపెంపకం, మినీ గోకులాల వివరాలు ఇవ్వాలని రాత పూర్వకంగా సమాచారహక్కుచట్టం ద్వారా వివరాలు కోరినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ పథకాల మంజూరులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని దానిని బయట పెట్టేందుకే సమాచారం కోరినట్లు తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



పీలేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నేతలు

వాల్మీకిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మాలమహానాడు కార్యవర్గం సభ్యుడు ధరణికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు మండల యూత్ అధ్యక్షుడు జెట్టి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ దుశ్చర్యపై సిట్టింగ్ జడ్జీతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య, జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుండ్లూరు రాజేశ్వరి, మాలమహానాడు మహిళా అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు రహమత్‌పీర్, పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆటో కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

పెద్దమండ్యం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లిలో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు ఎంపీడీఓ శ్రీధర్‌రావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. తాగునీటి పథకం బోరు నుంచి సక్రమంగా తాగునీటి సరఫరా కాలేదన్నారు. కనుమలోపల్లి కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నేతలు, అధికారులు చర్యలు తీసుకుని సి.గొల్లపల్లిలో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరారు.

రేపు అవగాహన సదస్సు

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని గ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఎష్ కుమార్ తెలిపారు. 26న ఉదయం 10 గంటలకు మదనపల్లె, రామారావు కాలనీలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్‌లోని గ్రామీణ ప్రాంత వైద్యుల సలహాలు, సూచనలు తెలియజేయడానికి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామీణ వైద్యులు తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రేపు డయల్ యువర్ డీఎం

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ వన్ డిపోలో 26న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ప్రయాణికులు డిపో పరిధి సర్వీసులు సమస్యలు, ఆర్టీసీకి ఆదాయం పెంచడానికి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. వివరాలకు డీఎం 9959225676 సంప్రదించాలన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

వాల్మీకిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. ప్రభుత్వ చౌక దుకాణాల నుంచి పొందే నిత్యావసరాల దృష్ట్యా ఈకేవైసీ లేనివారు సమీపంలోని ప్రభుత్వ చౌక దు కాణంలో మార్చి 31వ తేదీలోగా సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు.

అడ్మిషన్‌లు ప్రారంభం

నిమ్మనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ముష్టూరు పంచాయతీలోని కేజీబీవీ పాఠశాలలో 6వతరగతి, ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్‌ఓ మునివెంకటమ్మ పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 6వతరగతిలో మొత్తం 40సీట్లు, జూనియర్ ఇంటర్‌లో 40సీట్లు వున్నాయన్నారు. సీనియర్ ఇంటర్‌లో 10సీట్లు, 7వతరగతిలో 1, 8వతరగతిలో 1 సీట్లు వున్నట్లు తెలిపారు. విద్యార్థులు 22నుంచి ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

గుర్రంకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లెలో సోమవారం సర్పంచ్ ప్రేమకుమారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన రమాదేవి ఆస్పత్రి వైద్యులు ప్రజలకు వివిధ రకాల పరీక్షలను చేశారు. కన్ను, ఎముకలకు సంబంధించి 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఉచితంగా వైద్యం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు, విజయ్‌కుమార్, వెంకటరమణ, డాక్టర్లు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

గుర్రంకొండ, మార్చి 24(ఆంధ్రజ్యో తి): ప్రజలు, రైతులు పీజీఆర్‌ఎస్ అందజేసే అర్జీలను సత్వరమే పరి ష్కరించాలని తహసీల్దార్ శ్రీనివా సులు సిబ్బందికి సూచించారు. సమావేశంలో సిబ్బంది మాట్లాడు తూ ప్రజలు, రైతులు సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పు డు పరిష్కరించేలా పని చేయాలన్నారు. ప్రజల అర్జీలను క్షేత్ర స్థా యిలో పరిశీలించి న్యాయం చేయా లన్నారు. డీటీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాస్ రాష్ట్ర కమిటీలోకి ముగ్గురు



మల్లెల మోహన - నీరుగట్టి రమణ - పీర్‌బాషా

మదనపల్లె అర్బన్/పీలేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నుంచి బాస్ రాష్ట్ర కమిటీలోకి ముగ్గురిని ఎంపిక చేసినట్లు బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ తెలిపారు. ఆదివారం గుంటూరు లో నిర్వహించిన భారతీయ అంబేడ్కర్ సేన బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు దుర్గం సుబ్బారావు, కేవీ రమణ, పర్యవేక్షణ లో రాష్ట్ర కమిటీ ఎంపిక చేశారు. మదనపల్లె వాసులు మోహన రాష్ట్ర అధికార ప్రతినిధి, నీరుగట్టి రమణ కోశాధికారి, టీఏ పీర్‌బాషా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కాగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పీలేరు వాసి పాలకుంట శ్రీనివాసులును నియమిస్తూ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ బాస్ కార్యక్రమాలు మరింత విస్తరింపజేస్తామన్నారు.